RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 30 ఆగస్ట్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:80

## ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ: గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి

**తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి**

**అర్హులైన వారు ఓటు కోల్పోకుండా**

**సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం**

**ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం**

తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు



ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు.

దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ERO\T) తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## తుమ్మిడిహట్టి బ్యారేజీ: మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

**ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి**

**తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం**

**భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్**

**సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు**



ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

## గవర్నర్‌ను పరామర్శించిన త్రిపుర గవర్నర్



హైదరాబాద్ లోక్‌భవన్‌లో శనివారం తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను త్రిపుర గవర్నర్ ఇంద్ర సేనారెడ్డి, పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ లు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. గవర్నర్ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు తప్పనిసరి

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పే విధానాన్ని సహించేది లేదు**

**పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి.. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు**

**రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరగాలి**

**ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్షలో**

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**




హైదరాబాద్, సూర్యాపేట: తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో తప్పనిసరిగా స్పష్టమైన మార్పు కనిపించాలని, ప్రజలను అనవసరంగా కార్యాలయాల చుట్టూ తిప్పే విధానానికి స్వస్తి పలకాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన ప్రతి దరఖాస్తును సానుకూల దృక్పథంతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని మంత్రి స్పష్టం చేశారు. చట్టంలోని నిబంధనలను పాటిస్తూనే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని, రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా అధికారులు పనిచేయాలని అన్నారు.

శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే, గృహ నిర్మాణ శాఖల సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు.

45 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచడంపై వివరణ

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు తహసీల్దార్ లాగిన్‌లో భూములకు సంబంధించిన 45 దరఖాస్తులు ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉండటాన్ని మంత్రి ప్రస్తావించారు. ఈ విషయంపై సంబంధిత తహసీల్దార్‌ను వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటిని రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని, ప్రతి దరఖాస్తుపై అధికారులు బాధ్యత తీసుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సూచించారు.

ప్రజలను ఇబ్బంది పెట్టే విధానాలకు చోటు లేదు

తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు తమ కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సేవా దృక్పథంతో పరిష్కరించాలని మంత్రి అన్నారు. అవసరం లేని పత్రాలు, ప్రక్రియల పేరుతో ప్రజలను తిప్పుకోవడం, చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా రోజుల తరబడి వేచి ఉండేలా చేయడం వంటి విధానాలను నివారించాలని స్పష్టం చేశారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. ప్రజల సమస్యలను పరిష్కరించాలి.. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చిన వ్యక్తి సంతృప్తితో తిరిగి వెళ్లేలా చూడాలి అని మంత్రి సూచించారు.

మిగతా 2 లో

## రేవంత్ రెడ్డి కి రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ నివేదిక



రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థపై వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని కలిసి నివేదిక అందించింది. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక యూనిట్లతో చిన్న నీటిపారుదల వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయాలని కమిషన్ తన నివేదికలో సూచించింది.

తెలంగాణ వ్యవసాయ - రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి నేతృత్వంలో సభ్యులు రాములు నాయక్ , రాంరెడ్డి గోపాల్ రెడ్డి , గంగాధర్ ఎం. భవానీరెడ్డి ముఖ్యమంత్రి ని జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి నివేదిక అందించారు.

కమిషన్ సిఫారసులపై ముఖ్యమంత్రి వారితో చర్చించారు. పంటల మార్పిడి, ఉద్యానవన పంటల సాగు పెంపు, ఎఫ్‌పీవోల ఏర్పాటు వంటి అంశాలపై కమిషన్ దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

రాష్ట్రంలో చిన్న నీటిపారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి నివేదికలో కమిషన్ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను కలిపే కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించింది. చెరువుల పరిరక్షణకు ప్రత్యేకంగా చిన్న నీటిపారుదల చట్టం రూపొందించాలని, చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) సరిహద్దులను తక్షణం గుర్తించి ఆక్రమణలను తొలగించి పరిరక్షించాలని సూచించింది.

తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని తెలిపింది. గడిచిన రెండేళ్ల కాలంలో రైతు కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ ప్రతినిధి బృందం వివరించింది. కమిషన్ పనితీరుపై ముఖ్యమంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు.

**ఎమ్మెల్సీ రహ్మాత్ బేగ్‌పై వేటు.. అసదుద్దీన్‌ను నిలదీసిన రాజాసింగ్**

వార్తా 2 లో

ప్రజాబలం

30 ఆగస్ట్ 2026 ఆదివారం

# రాష్ట్రాలకు పొంచి ఉన్న ముప్పు

హిమాలయాలు అంటే మంచు కొండలు. గ్లేషియర్లు. ప్రపంచంలోని కోట్లాది మందికి జీవనాధారం అందించే నదుల పుట్టినిల్లు. కానీ ఇప్పుడు ఇదే హిమాలయ ప్రాంతం వాతావరణ మార్పులతో ప్రమాదాలకు కేంద్రంగా మారుతోంది. మంచు వేగంగా కరుగుతోంది. గ్లేషియర్లు వెనక్కి తగ్గుతున్నాయి. కొత్తగా ఏర్పడుతున్న హిమ సరస్సులు ఉబ్బిపోతున్నాయి. కొండచరియలు, మంచు చరియలు విరిగిపడి..ఆకస్మిక వరదలు ముంచెత్తుతున్నాయి. తాజాగా నేపాల్–టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన ఘోర వరదలు ఈ ప్రమాద తీవ్రతను మరోసారి ప్రపంచం ముందు ఉంచాయి.హిమాలయాల్లో మంచు కరుగుతోంది. కొండలు అస్థిరమవుతున్నాయి. హిమ సరస్సులు పెరుగుతున్నాయి. ఆకస్మిక వరదల ముప్పు విస్తరిస్తోంది. నేపాల్–టిబెట్ సరిహద్దులో తాజా విషాదం ఒక ప్రాంతానికి మాత్రమే సంబంధించిన ఘటన కాదు. హిమాలయాలు వేడెక్కితే.. ఆ ప్రభావం పర్వతాల నుంచి మైదానాల వరకు.. నదుల నుంచి కోట్లాది ప్రజల జీవనంపై పడే అవకాశం ఉంది. హిమాలయాల్లో వరద పుట్టేది ఎత్తైన పర్వత ప్రాంతాల్లో.. మొదటి దెబ్బ తగిలేది గ్లేషియర్ దిగువన ఉన్న నదీ లోయలకు.. ఆ తర్వాత నదీ తీర గ్రామాలు, రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ప్రభావితమవుతాయి.. చివరికి నది ప్రవాహం దిగువ మైదాన ప్రాంతాలకు చేరుతుంది.అందుకే వరద పుట్టేది పర్వతాలపై.. మొదటి దెబ్బ నదీ లోయలకు.. తర్వాత నదీ తీర గ్రామాలకు.. చివరికి దిగువ మైదాన ప్రాంతాలకు అనే ప్రమాద గొలుసును ముందుగానే అర్థం చేసుకోవాలి.హిమాలయాల్లో వచ్చే వరదలకు భారతదేశంలో ప్రధానంగా సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లడఖ్ ప్రాంతాలు నేరుగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అయితే వరద నీరు నదుల వెంట దిగువకు ప్రవహించడంతో పశ్చిమ బెంగాల్, అసోం వంటి మైదాన రాష్ట్రాలపైనా ప్రభావం పడొచ్చు.టిబెట్‌లో పుట్టే అనేక నదులు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. యార్లుంగ్ సాంగ్పో భారత్‌లోకి వచ్చిన తర్వాత సియాంగ్‌గా.. ఆపై అసోంలో బ్రహ్మపుత్రగా ప్రవహిస్తుంది. మరోవైపు తీస్తా వంటి నదులు సిక్కిం, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల హిమాలయాల్లో వరద అంటే పర్వత ప్రాంతానికే పరిమితమైన సమస్య కాదు.. నదీ ప్రవాహం ఎక్కడివరకు వెళ్తుందో అక్కడివరకు ముప్పు విస్తరించే అవకాశం ఉంటుంది.నష్టం ఎంత ఉంటుందనేది వరద పరిమాణం, నది వెడల్పు, లోయ ఆకారం, దిగువన ఉన్న జనాభా, వంతెనలు, డ్యామ్‌లు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది.సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగడంతో తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా భారీగా పెరిగింది. ఈ విపత్తులో ప్రాణ నష్టం సంభవించడంతో పాటు వంతెనలు, రహదారులు, భవనాలు, విద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 1,200 మెగావాట్ల తీస్తా–ఎఎఎ జలవిద్యుత్ ప్రాజెక్టు కూడా తీవ్రంగా ప్రభావితమైంది. వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యారు.చమోలీలో సంభవించిన ఆకస్మిక వరదలో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు లేదా గల్లంతయ్యారు. జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, నదీ లోయల్లోని మౌలిక సదుపాయాలు భారీగా దెబ్బతిన్నాయి. ఈ రెండు ఘటనలు చెబుతున్న సందేశం ఒక్కటే?ప్రాణ నష్టంతో పాటు విద్యుత్, రవాణా, వ్యవసాయం, పర్యాటకం, స్థానిక ఆర్థిక వ్యవస్థలపైనా భారీ ప్రభావం పడుతుంది.నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో భారీ వరదలు, మట్టి ప్రవాహాలు విధ్వంసం సృష్టించాయి. గ్లేషియర్‌లోని మంచు, రాళ్లు ఒక్కసారిగా కూలిపోయి భారీ నీటి ప్రవాహం ఏర్పడిందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. భోటే కోసి నది లోయలోకి దూసుకొచ్చిన వరదలు గ్రామాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేశాయి. వందలాది మంది ప్రాణాలు కోల్పోగా.. పెద్ద సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. గల్లంతైన వారిలో విదేశీయులు, పర్యాటకులు, యాత్రికులు కూడా ఉన్నారు.ఈ ఘటనకు భూకంపమే కారణమన్న తొలినాటి అనుమానాలను తర్వాతి పరిశీలనలు బలపరచలేదు. గ్లేషియర్ కూలిపోవడం, మంచు–రాళ్ల ప్రవాహం, నదిలో ఒక్కసారిగా భారీ నీటి ఉద్ధృతి కలిసి ఈ విపత్తుకు కారణమైందని నిపుణుల అంచనాలు సూచిస్తున్నాయి. దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు సహాయక చర్యలకు కూడా పెద్ద అవరోధంగా మారాయి.హిమాలయాల్లో ఇటువంటి విపత్తులు గతంలోనూ వచ్చాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో మంచు–రాళ్ల ప్రవాహం, వరదలతో 200 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. 2023లో సిక్కింలోని సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగి గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 2024లో నేపాల్‌లో భారీ వర్షాలు, వరదలు, కొండచరియలతో వందల మంది మరణించారు. అదే ఏడాది నేపాల్‌లోని థామే ప్రాంతంలో గ్లేషియల్ లేక్ ఔట్‌బర్స్ట్ ఫ్లడ్ వచ్చి ఇళ్లు, హోటళ్లు, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సహా అనేక నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. 2025లోనూ నేపాల్–టిబెట్ సరిహద్దులో భారీ వరదలు ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి.హిమాలయాల ఎత్తు ప్రాంతాన్ని బట్టి భారీగా మారుతుంది. పర్వత పాద ప్రాంతాలు కొన్ని వందల మీటర్ల ఎత్తులో ఉండగా.. ఎత్తైన హిమాలయ ప్రాంతాల్లో 5,000 నుంచి 6,000 మీటర్లకు పైగా ఎత్తులు సాధారణం. ఎవరెస్ట్ వంటి శిఖరాలు 8,000 మీటర్లకు పైగా ఎత్తులో ఉన్నాయి.భారత్‌లోని హిమాలయ రాష్ట్రాల్లో అనేక పట్టణాలు, గ్రామాలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులు నదీ లోయలకు సమీపంలోనే ఉన్నాయి. పర్యాటకం పెరగడం, రహదారులు విస్తరించడం, కొండ ప్రాంతాల్లో నిర్మాణాలు పెరగడం వల్ల ప్రమాద సమయంలో ప్రభావితమయ్యే ఆస్తుల విలువ కూడా పెరుగుతోంది. ఒక గ్లేషియర్ లేదా హిమ సరస్సు నుంచి అకస్మాత్తుగా నీరు విడుదలైతే.. అది కేవలం నీరు కాదు. నీటితో పాటు రాళ్లు, మట్టి, మంచు, చెట్లు, నిర్మాణాల అవశేషాలు కూడా దిగువకు కొట్టుకొచ్చే అవకాశం ఉంది. దీంతో సాధారణ వరద కంటే విధ్వంసకరంగా మారుతుంది.ఇలాంటి విపత్తులను పూర్తిగా ఆపడం సాధ్యం కాకపోయినా.. నష్టాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం సాధ్యమే. ప్రమాదకర హిమ సరస్సులను ఉపగ్రహాలు, డ్రోన్లు, రిమోట్ సెన్సింగ్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలి. సరస్సుల్లో నీటి మట్టం, మంచు గోడల స్థిరత్వాన్ని కొలిచే సెన్సర్లను ఏర్పాటు చేయాలి. అత్యంత ప్రమాదకర సరస్సుల్లో అవసరమైన చోట నియంత్రితంగా నీటిని తగ్గించే చర్యలు చేపట్టాలి. అంతకంటే ముఖ్యంగా ఎర్లీ వార్నింగ్ సిస్టమ్‌లను బలోపేతం చేయాలి. ఎగువ ప్రాంతాల్లో ప్రమాద సంకేతాలు గుర్తించిన వెంటనే దిగువ గ్రామాలకు సైరన్లు, మొబైల్ అలర్టులు, రేడియో, ఇతర కమ్యూనికేషన్ మార్గాల ద్వారా సమాచారం చేరాలి.హిమాలయాలు భారత్, నేపాల్, భూటాన్, చైనా వంటి అనేక దేశాలకు సాధారణ సహజ వ్యవస్థ. ఒక దేశంలో గ్లేషియర్ కదలిక లేదా హిమ సరస్సు ఉప్పొంగడం మరో దేశంలోని నదీ ప్రవాహాన్ని ప్రభావితం చేయవచ్చు. అందుకే ఉపగ్రహ డేటా, వాతావరణ సమాచారం, హిమ సరస్సుల పరిస్థితి, నదీ నీటి మట్టాలు, వరద హెచ్చరికలను దేశాల మధ్య వేగంగా పంచుకునే వ్యవస్థ అవసరం.

# మారిషస్‌లో తెలుగుకు తెలంగాణ అండ

## ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎంతో మారిషస్ బృందం భేటీ

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మారిషస్ లో తెలుగు భాష, సంస్కృతి, పురాణ ఇతిహాసాలను ప్రమోట్ చేసేందుకు ఆదేశానికి అన్ని విధాలా సహకరిస్తామని మారిషస్ ప్రతినిధులుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క్ చెప్పారు. శనివారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేటివ్ సర్వీసుల మంత్రి లచ్మనా రాజ్ పెంటియా బృందం ఉప ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వారితో మాట్లాడుతూ.. తెలంగాణ – మారిషస్ మధ్య సుదీర్ఘకాలంగా సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. ఇరు దేశాల మధ్య ఉమ్మడి చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ప్రజల మధ్య స్నేహపూర్వ సంబంధాలున్నామని గుర్తు చేశారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల ద్వారా తెలంగాణకు మారిషస్‌తో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. మారిషస్‌లోని తెలుగు సమాజం అక్కడి గొప్ప బహుళ సాంస్కృతిక సమాజంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉందన్నారు.

మారిషస్ ప్రభుత్వం చేపడుతున్న రామ భజనంను కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క చెప్పారు. విద్య, సాంస్కృతిక పరిశోధన, కళలు, భాష, సాంస్కృతిక అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. మారిషస్ లోని తెలుగు కల్చరల్ సెంటర్ లో లక్షలాదిమంది తెలుగు ప్రవాసులు తమ సంస్కృతి, సంప్రదాయాలను, భాష పరిరక్షణ చేస్తున్నారని మారిషస్ మంత్రి తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సమాజం పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు, తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించేందుకు చేస్తున్న కృషి పట్ల వారు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

# తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్ల పనితీరులో మార్పు తప్పనిసరి

## ఉమ్మడి నల్గొండ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

రీ–సర్వేలోనూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ

రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత చేపట్టిన రీ–సర్వేకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్‌లో రెండో విడత రీ–సర్వే చేపట్టేందుకు ఇప్పటి నుంచే అధికారులు సిద్ధం కావాలని సూచించారు.

తొలి విడతలో రీ–సర్వే చేపడుతున్న 70 గ్రామాల్లో సర్వేను పారదర్శకంగా నిర్వహించి గ్రామ సరిహద్దులను పక్కాగా నిర్ధారించాలని ఆదేశించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రీ–సర్వేను ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని, ఆర్డీవోలు, తహసీల్దార్లు కూడా గ్రామసభలకు హాజరై పరిస్థితులను తెలుసుకోవాలని సూచించారు.

సర్వే నిర్వహించిన రోజే భూ రికార్డులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని, సర్వేయర్ల కొరత ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే పక్క మండలాల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని అన్నారు. విధులకు హాజరుకాని లైసెన్స్ సర్వేయర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు 15 రోజుల్లో పరిష్కరించాలి

ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో ఉన్న ఎల్–1, ఎల్–2, ఎల్–3 సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 15 రోజుల్లో ఎల్–3 సమస్యలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు.

మొదటి విడతలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దసరాలోపు పూర్తి చేయాలని, గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో వివిధ దశల్లో నిలిచిపోయిన నిర్మాణాలను గుర్తించి 15 రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అన్ని పన్నులు, రవాణా చార్జీలు కలుపుకొని రూ.230కే సిమెంట్ బస్తా అందించేలా సిమెంట్ కంపెనీలతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇళ్లకు సమీపంలో ఎక్కడ ఇసుక లభిస్తే అక్కడి నుంచి అందించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నల్గొండ పట్టణంలో ఇందిరమ్మ టవర్స్ కింద 500 గృహాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇంటి పట్టాల పంపిణీ వేగవంతం చేయాలి

గతంలో ఇంటి పట్టాల కోసం భూములను గుర్తించినప్పటికీ ఇంకా పంపిణీ చేయని వాటిని వెంటనే గుర్తించి జాబితా రూపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించిన సమస్యలను కూడా చట్టానికి లోబడి శాశ్వతంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలకు పరిష్కారం చూపడమే రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యతగా ఉండాలని అన్నారు.

# ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్‌పై వేటు.. అసదుద్దీన్‌ను నిలదీసిన రాజాసింగ్

**మజ్లిస్ ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరణ**

**అర్ధరాత్రి చర్యల వెనుక కారణాలు చెప్పాలన్న రాజాసింగ్**

**అసదుద్దీన్ ఓవైసీ మీడియా ముందు వివరణ ఇవ్వాలని డిమాండ్**

**ల్యాండ్ వివాదాలు, వ్యక్తిగత ఆరోపణలే కారణమంటూ ప్రచారం**

**డీప్‌ఫేక్ వీడియోల అంశంపైనా స్పష్టత కోరిన బీజేపీ ఎమ్మెల్యే**



ఆల్ ఇండియా మజ్లిస్–ఇ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరించడంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన మజ్లిస్ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని డిమాండ్ చేశారు.

శుక్రవారం అర్ధరాత్రి రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మజ్లిస్ పార్టీ ప్రకటించింది. దీనితో పాటు, ఆయన తక్షణమే తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేయాలని ఆదేశించింది. ఆయనపై ఉన్న కొన్ని వివాదాల కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు సంకేతాలిచ్చినప్పటికీ, బహిష్కరణకు గల నిర్దిష్ట కారణాలను మాత్రం అధికారికంగా వెల్లడించలేదు.

ఈ నేపథ్యంలో రాజాసింగ్ మాట్లాడుతూ, ఈ బహిష్కరణ పాతబస్తీ ప్రజల్లో అనేక సందేహాలను రేకెత్తించిందని అన్నారు. అర్ధరాత్రి వేళ అత్యవసరంగా ఇటువంటి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితులు ఎందుకు తలెత్తాయో పార్టీ నాయకత్వం వివరించాలని ఆయన ప్రశ్నించారు. అసదుద్దీన్ ఓవైసీ జాతీయ మీడియా ముందుకు వచ్చి, ఈ ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు.

భూవివాదాలు, లైంగిక వేధింపుల అంశాలకు సంబంధించిన ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని రాజాసింగ్ గుర్తుచేశారు. గతంలో తనను డీప్‌ఫేక్ వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని రహ్మత్ బేగ్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, తాజా పరిణామాలకు ఆ ఘటనతో ఏమైనా సంబంధం ఉందా అనే విషయంపై క్లారిటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన.

రుద్రవరం. మండలం లోనిపెద్ద కంబలూరు గ్రామంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే అధిక ఉష్ణోగ్రతలు, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా ఉద్యానవన అధికారి యు. నాగరాజు, 3 ఎఫ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్, మహానంది పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం.కె. నాయక్, 3 ఎఫ్ జోనల్ హెడ్ ఫిరోజ్, ఉద్యానవన అధికారి డి. దస్తగిరి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి యు. నాగరాజు మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతం లోపం ఏర్పడే అవకాశం ఉన్నందున ఆయిల్‌పామ్ తోటల్లో నీటి యాజమాన్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు సూచించారు. డ్రిప్ సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వినియోగిస్తూ, మొక్కలకు అవసరమైన సమయంలో తగినంత నీటిని అందించాలని తెలిపారు.మహానంది పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డా. ఎం.కె. నాయక్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల సమయంలో ఆయిల్‌పామ్ మొక్కలకు తేమ ఒత్తిడి రాకుండా చర్యలు చేపట్టాలని, నేలలో తేమను నిలుపుకునేందుకు మల్చింగ్, సేంద్రీయ పదార్థాల వినియోగం, కలుపు నివారణ వంటి పద్ధతులను పాటించాలని వివరించారు. మొక్కల వయస్సు, నేల పరిస్థితులకు అనుగుణంగా నీరు, ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు.3 ఎఫ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ తోటల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సూచనలు, రైతులకు సంస్థ అందించే సహకారం గురించి వివరించారు.3 ఎఫ్ జోనల్ హెడ్ ఫిరోజ్ రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అధిక ఉష్ణోగ్రతలు, తేమ లోపం సమయంలో తోటలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.ఉద్యానవన అధికారి డి. దస్తగిరి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో నీటి యాజమాన్యం చేపట్టాలని, శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా ఆయిల్‌పామ్ తోటలను ఆరోగ్యంగా నిర్వహించుకోవచ్చని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రుద్రవరం మండలంలో ఆయిల్ పామ్ చేసిన రైతులు, ఉద్యానవన శాఖ సిబ్బంది, 3 ఎఫ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# చల్మెడ--నందగోకుల్ రోడ్డు కోసం పాదయాత్ర

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన

**నిజాంపేట్ మండల ప్రజాబలం ప్రతినిధి:** నిజాంపేట, నందగోకుల్--నస్కల్--చెల్మెడ కమాన్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నందగోకుల్ నుంచి చెల్మెడ కమాన్ వరకు సాగిన పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నందగోకుల్‌లోని హనుమాన్ దేవాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజలతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల కష్టాలు తీర్చాలని నినాదాలు చేశారు.




**రహదారి అధ్వానంతో అవస్థలు..**

ఈ సందర్భంగా పద్మా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నందగోకుల్--నస్కల్--చెల్మెడ కమాన్ మధ్య రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గుంతలు, కంకర, బురదతో వర్షాకాలంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. రైతులు, వాహనదారులు, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారి దుస్థితి కారణంగా విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన ఆర్టీసీ బస్సు సేవలు కూడా నిలిచిపోయాయని, దీంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

**వారం రోజుల్లో పనులు ప్రారంభించాలి..**

రోడ్డు నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని పద్మా దేవేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన మేరకు కొంతమేర పనులు జరిగాయని, కాంట్రాక్టర్‌కు రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. బిల్లులను వెంటనే చెల్లించి మిగిలిన రహదారి పనులు పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో రహదారి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించాలని, లేకుంటే నందగోకుల్, నస్కల్, చెల్మెడ ప్రాంతాల ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు పూర్తయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని, అవసరమైతే రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు.

**ప్రభుత్వం స్పందించాలి..**

మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టాలను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రహదారి పరిస్థితి దారుణంగా ఉన్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. పాదయాత్రను చూసైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో ముఖ్యంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

వారం రోజుల్లో పనులు ప్రారంభించకపోతే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లావణ్యారెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, బట్టి జగపతి, జీవన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు బాజా చంద్రం, బాపురెడ్డి, మాజీ ఎంపీపీ సంపత్, మాజీ ఎంపీటీసీలు బాల్‌రెడ్డి, వెంకటస్వామి, కిష్టాగౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, బీఆర్ఎస్వీ నాయకుడు బజార్ రంజిత్‌గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ అజీజ్, గౌస్, సుప్రభాతరావు, భాస్కరరావు, మున్సిపల్ కౌన్సిలర్ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

# ఏథర్ నుంచి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్.. రూ.1 లక్షకే 'కోణార్క్'

**ఏథర్ ఎనర్జీ నుంచి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'కోణార్క్' విడుదల**

**రూ.లక్ష ప్రారంభ ధర, ఆరు విభిన్న వేరియంట్లలో లభ్యం**

**ఒక్కసారి ఛార్జ్ చేస్తే 200 కిలోమీటర్ల వరకు రేంజ్**

**బ్యాటరీపై 10 ఏళ్లు లేదా లక్ష కిలోమీటర్ల వారంటీ ప్రకటించిన సంస్థ**

**అపార్ట్‌మెంట్ల కోసం ప్రత్యేకంగా 'ఏథర్ నోడ్' ఛార్జింగ్ వ్యవస్థ**

ప్రముఖ దేశీయ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ, భారత మార్కెట్లోకి మరో సరికొత్త ఉత్పత్తిని తీసుకొచ్చింది. శనివారం జరిగిన 'కమ్యూనిటీ డే 2026' కార్యక్రమంలో భాగంగా, సామాన్యులను లక్ష్యంగా చేసుకుని 'ఏథర్ కోణార్క్' పేరుతో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధరను రూ.99,999 గా నిర్ణయించింది. కేవలం స్కూటర్‌ను మాత్రమే కాకుండా, సరికొత్త బ్యాటరీ ప్లాట్‌ఫామ్, అధునాతన ఛార్జింగ్ సదుపాయాలు, వాహన ఓనర్‌షిప్‌కు సంబంధించిన టూల్స్‌ను కూడా కంపెనీ పరిచయం చేసింది.



**'కోణార్క్' ప్రత్యేకతలు ఇవే..**

ఏథర్ నుంచి వస్తున్న 450 సిరీస్ స్కూటర్లు అధిక పనితీరుకు ప్రాధాన్యం ఇవ్వగా, 'కోణార్క్' మాత్రం రోజువారీ వినియోగానికి అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించబడింది. ఏథర్ అభివృద్ధి చేసిన కొత్త 'ఈఎల్ ప్లాట్‌ఫామ్' ఆధారంగా వస్తున్న తొలి స్కూటర్ ఇదే. మొత్తం ఎస్, జడ్ లైన్‌అప్‌లలో ఆరు వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుంది.

ఐడీసీ సర్టిఫైడ్ రేంజ్ ప్రకారం, ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే వేరియంట్‌ను బట్టి 100 నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ పేర్కొంది. ప్రతి 10,000 కిలోమీటర్లకు ఒకసారి సర్వీసింగ్ చేయిస్తే సరిపోతుంది. అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్ (ూవదీూ), మ్యాజిక్‌కీ, ఆటోపాప్, ఎయిర్‌వాక్ మోడ్ వంటి అత్యాధునిక ఫీచర్లను ఇందులో పొందుపరిచారు.

**10 ఏళ్ల వారంటీతో 'బెడ్‌రాక్' బ్యాటరీ**


ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన ఆకర్షణ ఏథర్ ఐదో తరం 'బెడ్‌రాక్' బ్యాటరీ ప్లాట్‌ఫామ్. ఈ బ్యాటరీపై కంపెనీ ఏకంగా 10 ఏళ్లు లేదా 1,00,000 కిలోమీటర్ల వారంటీని అందిస్తోంది. ఇందులో ఉన్న 'బ్రీచ్‌సెన్స్' టెక్నాలజీ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బ్యాటరీకి కలిగే సూక్ష్మమైన డ్యామేజ్‌ను, తేమ చేరే ప్రమాదాన్ని వెంటనే గుర్తిస్తుంది. మెరుగైన సెల్ బ్యాలెన్సింగ్ టెక్నాలజీ వల్ల లక్ష నుంచి 1.2 లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కూడా బ్యాటరీ ఆరోగ్యం 70 శాతం వరకు ఉంటుందని ఏథర్ భరోసా ఇస్తోంది.

అపార్ట్‌మెంట్ల కోసం 'ఏథర్ నోడ్'

స్కూటర్‌తో పాటు, ఏథర్ సంస్థ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి పెట్టింది. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల్లో ఛార్జింగ్ సమస్యను అధిగమించేందుకు 'ఏథర్ నోడ్' అనే లోడ్-మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పరిచయం చేసింది. ఇది ఒకేసారి 1,000 ఛార్జర్లను నిర్వహించగలదు. విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు ఆటోమేటిక్‌గా ఛార్జింగ్‌ను నిలిపివేసి, పవర్ మేనేజ్‌మెంట్ చేస్తుంది. దీంతో పాటు పాత స్కూటర్ల యజమానుల కోసం 'ఏథర్ ట్రూ హెల్త్' అనే రిపోర్ట్‌ను కూడా ప్రకటించింది. ఇది వాహనం కండిషన్, బ్యాటరీ ఆరోగ్యం, రైడింగ్ హిస్టరీ వంటి వివరాలను అందించి, మెరుగైన రీసేల్ విలువ పొందడానికి సహాయపడుతుంది.

మొత్తం మీద, కేవలం కొత్త స్కూటర్‌ను విడుదల చేయడమే కాకుండా, బ్యాటరీ లైఫ్, ఛార్జింగ్ సౌలభ్యం, రీసేల్ వంటి అంశాలపై దృష్టి సారించి, వినియోగదారులకు ఒక సంపూర్ణ ఓనర్‌షిప్ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఏథర్ ముందుకు వెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

# బీడీ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా అయ్యవారి లక్ష్మణ్ ఏకగ్రీవ ఎన్నిక



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మెదక్ జిల్లా: ఆల్ ఇండియా బీడీ, సిగార్ అండ్ టొబాకో వర్కర్స్ ఫెడరేషన్ 13వ జాతీయ మహాసభలు బీహార్ రాష్ట్రంలోని సమస్తిపూర్ జిల్లా దర్భింసరాయి పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో 2026 ఆగస్టు 23, 24 తేదీలలో ఘనంగా జరిగాయి.

ఈ జాతీయ మహాసభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన బీడీ, సిగార్ అండ్ టొబాకో కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మహాసభల్లో కార్మికుల సమస్యలు, వారి హక్కులు, సంక్షేమం, వేతనాలు, సామాజిక భద్రత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన మెదక్ జిల్లా బీడీ కార్మిక సంఘం సెక్రటరీ అయ్యవారి లక్ష్మణ్ గారిని ఆల్ ఇండియా బీడీ, సిగార్ అండ్ టొబాకో వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అయ్యవారి లక్ష్మణ్ గారు బీడీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గతంలో చేసిన కృషిని గుర్తించి జాతీయ స్థాయిలో బాధ్యతలు అప్పగించడం పట్ల మెదక్ జిల్లా బీడీ కార్మికులు, కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

# పోలీస్ ఉద్యోగాల కోసం మైనారిటీ యువతకు ఉచిత కోచింగ్

## ఎస్ఐ అభ్యర్థులకు పూర్తిగా ఉచితం.. కానిస్టేబుల్ అభ్యర్థులకు నామమాత్రపు ఫీజుతో శిక్షణ

కరీంనగర్, ఆగస్టు 29: యువతను శక్తివంతం చేయడంతో పాటు పోలీసు శాఖలో మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో జామాత్-ఎ-ఇస్లామీ హింద్ (జేఐహెచ్) కరీంనగర్ సిటీ ఆధ్వర్యంలో, అకాడమీ ఆఫ్ సక్సెస్ అండ్ అచీవ్‌మెంట్ సహకారంతో పోలీసు నియామక పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాన్ని ప్రకటించారు.సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ), పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు సమగ్ర శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ అభ్యర్థులకు పూర్తిగా ఉచితంగా కోచింగ్ అందించనుండగా, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు అందుబాటులో ఉండే విధంగా నామమాత్రపు ఫీజుతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.అభ్యర్థులు ఏకాగ్రతతో చదువుకునేందుకు పూర్తి స్థాయి రెసిడెన్షియల్ కోచింగ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. యువతకు సరైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించి వారిని ఉద్యోగ సాధన దిశగా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు వెల్లడించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన వ్యూహాత్మక సమావేశంలో పోలీసు శాఖతో పాటు ఇతర చట్ట అమలు విభాగాల్లో మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరంపై చర్చించారు. యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పోటీ పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయడం ద్వారా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జామాత్-ఎ-ఇస్లామీ హింద్ ప్రతినిధులు తెలిపారు.ఈ సమావేశంలో జామాత్-ఎ-ఇస్లామీ హింద్ కరీంనగర్ సిటీ అధ్యక్షుడు జనాబ్ సోహైబ్ అహ్మద్ ఖాన్, కన్వీనర్ జనాబ్ అజీజ్ మొహమ్మద్, వివిధ యూనిట్ల అధ్యక్షులు జనాబ్ ఖైరుద్దీన్, జనాబ్ సుభాన్ పాషా, జనాబ్ ముజమ్మిల్ ఇర్ఫాన్, జనాబ్ రఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొని కార్యక్రమ నిర్వహణపై చర్చించారు.పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న అర్హత కలిగిన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

# 22ఏ భూముల సమస్యలపై పోరుబాట:

## బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ

**మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ**

**సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష**

**ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర**



తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది.

ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.

మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి రైల్వే కోడూరు నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ అధిష్టానం సూచనలు, ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రైల్వేకోడూరు శాసనసభ్యులు శ్రీధర్ కోరారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన ప్రణాళికను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, మండలంలో పార్టీ బలాబలాలను అంచనా వేసుకుని, స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. సెప్టెంబర్ 2న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో జనసేన యువజన విభాగాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ అధిష్టానం ప్రకటించిందని తెలిపారు. యువత, మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ పార్టీ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, జనసేన పార్టీ బలాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చాటేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కోరారు. పార్టీ అధిష్టానం ఏ బాధ్యత అప్పగించినా క్రమశిక్షణతో, సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని ఆయన నాయకులు, జనసైనికులకు సూచించారు.

# స్థానిక పోరుకు జనసేన సిద్ధం

కాకినాడ, ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే శుక్రవారం సాయంత్రం కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో పట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు. అలాగే ఏలూరు కార్పొరేషన్ విషయంలోనూ టీడీపీ పట్టుబట్టే అవకాశముంది. ఇక తిరుపతి విషయంలో గత శాసనసభ ఎన్నికల్లో అసెంబ్లీ స్థానం కేటాయించాం కాబట్టి ఈ సారి మేయర్ స్థానం తమకు ఇవ్వాలని జనసేన ముందు టీడీపీ కొంత ప్రతిపాదన పెట్టే అవకాశముంది. ఇక కాకినాడ కార్పొరేషన్ లో ఎటువంటి ఇబ్బందులు లేవు. అలాగే ఒంగోలు కార్పొరేషన్ ను కూడా టీడీపీ వదులుకునేందుకు సిద్ధపడకపోవచ్చు. అక్కడ పట్టు పోకుండా ఉండాలంటే కార్పొరేషన్ తమ గ్రిప్ లో ఉంచుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ పట్టుబట్టవచ్చు. ఇవి కాకుండా మిగిలిన చోటా చోటా కార్పొరేషన్లకు ఇచ్చేం దుకు టీడీపీ సిద్ధపడవచ్చు. ఐదు కార్పొరేషన్లకు మూడు కార్పొరేషన్లు జనసేనకు కేటాయించే అవకాశాలున్నాయి. ఉత్తరాంధ్ర లోనూ, రాయలసీమలోనూ కొన్ని చోట్ల కేటాయించే ఛాన్స్ ఉంది. అంతే తప్ప తమకు బలం ఉన్న స్థానాలను పొత్తులో భాగంగా వదులుకోకూడదన్న అభిప్రాయం కూడా టీడీపీ నేతల్లో ఉంది. ఐదు కార్పొరేషన్లు అడిగితే మూడు ఇస్తారన్నది జనసేన వ్యూహం కావచ్చు. అదే జరిగితే జనసేన కోరినవి కాకుండా దాని బలం అంచనా వేసి కాకినాడతో పాటు మరొక రెండు కార్పొరేషన్లు కోరే అవకాశముందని తెలిసింది. మొత్తం మీద జనసేన మాత్రం కొంత స్థానిక సంస్థల ఎన్నికల్లో గట్టిగానే స్థానాలను కోరాలని భావిస్తుంది. జనసేనఐదు కార్పొరేషన్లను తీసుకోగలిగితే 31.25 శాతం షేరింగ్ అవుతుంది.మరొకవైపు పవన్ కల్యాణ్ పై జనసైనికుల నుంచి కూడా ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో జనసేన ఏ రకంగా సీట్ల షేర్ సాధిస్తుందన్నది ఇప్పుడు అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

# అనిల్ లో నిర్వేదం..

నెల్లూరు, ఆగస్టు 29, పదవి ఉన్నా లేకపోయినా తనకో చరిత్ర ఉందని వైసీపీ ఆఫీసులో కూర్చుని పోసుకోలు కబుర్లు చెప్పిన అనిల్ కుమార్ మాటల నిర్వేదం వెనుక అసలు రహస్యం.. స్థానిక ఎన్నికల విషయంలో ఆయనకు నెల్లూరు సిటీలో అసలు బాధ్యతలే ఇవ్వకపోవడం. మున్సిపల్ ఎన్నికల్లో ఏకగ్రీవాలు జరిగితే తాను పోటీ చేయనంటూ ఆయన చేసిన ప్రకటనలు.. సొంతంగా బాధ్యత తీసుకోవడానికి చేసిన ప్రయత్నం అని వైసీపీ వర్గాలంటున్నాయి.స్థానిక సంస్థల ఎన్నికల సమరంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమన్వయ బాధ్యతలను పార్టీ అధిష్టానం ఆయనకు అప్పగించలేదు. ఆయన ఇంచార్జ్ కూడా కాదు. తాను ఏదో బాధ్యత తీసుకుంటున్నట్లు ఫోజు కొడుతూ చేసిన ప్రకటనలు కేవలం రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నమే. గత సార్వత్రిక ఎన్నికల నుంచి అనిల్ కుమార్ యాదవ్ రాజకీయ పరిస్థితి తలకిందులైంది. నెల్లూరు సిటీ నుంచి ఆయనను తప్పించి నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించగా, అక్కడ ఘోర పరాజయం పాలైన తర్వాత ఆయన అటువైపు వెళ్లడం పూర్తిగా మానేశారు. తిరిగి తన సొంత ఇలాకా అయిన నెల్లూరులో పట్టు నిలుపుకుందామంటే, అక్కడ స్థానిక వైసీపీలో రెడ్డి నేతలు ఆయనను కనీసం కాలుమోపనివ్వకుండా అడ్డుకుంటోంది. దీంతో చేతిలో అసెంబ్లీ నియోజకవర్గం లేక, ఎంపీగా ఓడిపోయిన ప్రాంతానికి వెళ్లలేక అనిల్ తీవ్ర రాజకీయ శూన్యతను ఎదుర్కొంటున్నారు.మరోవైపు, నెల్లూరు సిటీ నియోజకవర్గంపై పట్టు బిగించేందుకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే దూకుడు పెంచారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నెల్లూరు సిటీ టికెట్‌ను లక్ష్యంగా చేసుకున్న పర్వతరెడ్డి, తాజాగా స్థానిక సమరానికి సంబంధించి నెల్లూరు సిటీ బాధ్యతలన్నింటినీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకే అప్పగించారంటూ బహిరంగంగా ట్వీట్ చేయడం అనిల్ వర్గానికి పెద్ద షాక్‌గా మారింది. కార్పొరేషన్ వ్యవహారాల్లో చక్రం తిప్పుదామనుకున్న అనిల్ ఆశలపై ఈ పరిణామం నీళ్లు చల్లినట్లయింది. పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఈ స్పష్టమైన సంకేతంతో నెల్లూరు సిటీలో అనిల్‌కు రాజకీయంగా ద్వారాలు మూసుకుపోయినట్లేనని స్పష్టమవుతోంది.ఎలాగైనా తిరిగి నెల్లూరు సిటీ రాజకీయాల్లోకి రావాలని చూస్తున్న అనిల్ ప్రయత్నాలన్నీ వరుసగా బెడిసికొడుతున్నాయి. ఒకప్పుడు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో మంత్రిగా చక్రం తిప్పి, ప్రత్యర్థులపై విరుచుకుపడిన ఆయన, నేడు సొంత పార్టీలోనే ఏ బాధ్యతా లేని స్థితికి దిగజారడం గమనార్హం. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సరైన నియోజకవర్గం లేక, నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల బాధ్యతలను సైతం ప్రత్యర్థి వర్గం దక్కించుకోవడంతో అనిల్ రాజకీయ భవిష్యత్తు పూర్తిగా అగమ్యగోచరంగా మారింది.

# విజయవాడలో 10 చోట్ల ఫ్రీగా వసతి, ఫుడ్

విజయవాడ, ఆగస్టు 29, విజయవాడకు బతుకుదెరువు కోసం ప్రతి రోజూ ఎంతోమంది వస్తుంటారు. కూలీలు, కార్మికులు, చిరువ్యాపారులు.. ఇలా చాలామంది ఉంటారు. నగరంలో పలు ఎన్జీవోల సాయంతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 10 చోట్ల ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు ఉంటే చాలు ఈ షెల్టర్లలో ఉచితంగా వసతి, తిండి సౌకర్యం ఉంటుంది. చాలామందికి వీటిపై అవగాహన ఉండటం లేదు.. అందుకే అవగాహన కూడా కల్పిస్తున్నారు.చాలామంది ఉపాధి కోసం, ఇతరత్రా పనుల కోసం ప్రతిరోజూ విజయవాడ వస్తుంటారు. అలా వచ్చినవారికి వసతి విషయంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొంతమంది లాడ్జి, హోటల్‌లలో గదిని అద్దెకు తీసుకోవడానికి కూడా డబ్బులు లేని పరిస్థితుల్లో ఉంటారు. అలాంటి వారిలో చాలామంది రోడ్లు, బస్టాండ్లలో రాత్రిళ్లు పడుకునేవారు. ఇకపై ఎవరూ వసతి లేకుండా ఇబ్బందిపడకుండా విజయవాడలో సరికొత్త ఆలోచన చేశారు. విజయవాడలో ఉచితంగా ఆశ్రయం, భోజన సౌకర్యం కల్పిస్తున్నారు.. మున్సిపల్ సంస్థలు, ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పిస్తున్నాయి. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది.. ఉచితంగా వసతి పొందొచ్చు.విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మెప్మా, వివిధ ఎన్జీవోలు కలిసి ఉచితంగా వసతి కల్పించేందుకు ఆశ్రయాలు (షెల్టర్లు) ఏర్పాటు చేశారు. జాతీయ పట్టణ జీవనోపాధి పథకం కింద.. నగరంలోని రాణీగారితోట, వైఎస్సార్? కాలనీ, సీతన్నపేట, హనుమాన్ పేట, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెర కాలనీ, రూట్స్ హెల్త్ ఫౌండేషన్, మ్యాంగో మార్కెట్ వంటి పది ప్రాంతాల్లో ఈ ఉచిత షెల్టర్లు ఏర్పాట్లు చేశారు. వసతి పొందాలంటే ఆధార్ కార్డు చూపిస్తే చాలు రూపాయి కూడా తీసుకోకుండా 15 రోజుల పాటు ఉచితంగా వసతి కల్పిస్తారు. ఈ ఉచిత వసతి కల్పన గురించి విజయవాడ కార్పొరేషన్, ఎన్జీవో ప్రతినిధులు నగరంలో ప్రతిరోజూ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ ఉచిత వసతిపై ప్రచారం చేస్తున్నారు.ఒకవేళ ఎవరికైనా కుటుంబం లేకపోతే.. వాళ్లకు ఇక్కడ దీర్ఘకాలికంగా ఆశ్రయం కల్పిస్తున్నారు.. వారికి సమయానికి తిండి పెడుతూ వసతి కల్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి 15 నుంచి 20 రోజుల వరకు ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. ఇక్కడ దీర్ఘకాలం పాటు నివసించడానికి అవకాశం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. రోడ్లపై నిద్రించాల్సి వచ్చే వారి కోసమే ఈ షెల్టర్లు ఏర్పాటు చేశారని.. కానీ చాలామందికి అవగాహన లేకపోవడంతో ఇక్కడికి రావడం లేదంటున్నారు. అలాగే చాలామంది రోడ్లపై భోజనం పంపిణీ చేస్తుండటంతో ఈ షెల్టర్ల వైపు చూడంట లేదని చెబుతున్నారు. కాబట్టి ఎవరైనా ఆహారం, దుస్తులు, వస్తువులు పంపిణీ చేయాలనుకుంటే నేరుగా ఈ షెల్టర్లకు వచ్చి ఇస్తే బావుంటుందంటున్నారు.

# రికార్డు స్థాయిలో బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు

ఒంగోలు, ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధిలో జలవనరుల మేనేజ్‌మెంట్ అత్యంత కీలకమైనది. తీవ్రమవుతున్న వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రతికూల ప్రభావాలు రాష్ట్ర వ్యవసాయ రంగంపై పడకుండా ఉండేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే వారంలో దశాబ్దాలుగా నత్తనడకన సాగుతున్న రెండు బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టుల్లో రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేయించి, ప్రారంభోత్సవాలకు వేదిక సిద్ధం చేస్తున్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాల దాహార్తిని తీర్చే వెలిగొండ, ఉత్తరాంధ్ర ఆశల నిలయమైన పోలవరం ఎడమ కాలువ పనులను పరుగులు పెట్టించడం ద్వారా సర్కార్ తన పరిపాలనా ని ా వ ం ం ా ్ధ ్య ని ్ల నిరూపించుకుంటోంది.రాయలసీమలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు, ప్రకాశం , నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలకు జీవనాడిగా మారిన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి టన్నెల్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్ నుంచి నల్లమల అడవుల గుండా నీటిని తరలించే ఈ సంక్లిష్టమైన ఇంజనీరింగ్ పనులను సీఎం చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే ప్రకాశం జిల్లాలోని కంభం, మార్కాపురం, ఎర్రగొండపాలెం ప్రాంతాలకు తక్షణమే నీరందించడమే లక్ష్యంగా మైక్రో లెవెల్ ప్లానింగ్ అమలు చేస్తున్నారు. టన్నెల్-1 ద్వారా కృష్ణా జలాలను తరలించి వేసవికి ముందే ప్రకాశం జిల్లా భూములను తడిపేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ప్రాజెక్టులను ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడం కాదు.. మైక్రో లెవెల్ ప్లానింగ్, రోజువారీ పర్యవేక్షణతో గడువులోగా పూర్తి చేసి నీటిని అందించడమే అసలైన డెవలప్‌మెంట్ అన్నట్లుగా పనులు పరుగులు పెట్టిస్తున్నారు. మరోవైపు ఉత్తరాంధ్ర ఆర్థిక వికాసానికి మలుపు తిప్పే పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనుల పూర్తిపై జలవనరుల శాఖ రాత్రింబవళ్లు శ్రమిస్తోంది. గోదావరి వరద జలాలను పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంతానికి, అనకాపల్లి పారిశ్రామిక కారిడార్లకు తరలించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. గతంలో వదిలేసిన కాలువ గట్ల అనుసంధానం, గ్యాప్-1 , గ్యాప్-2 నిర్మాణ లోపాలను సాంకేతికంగా వేగంగా సరిదిద్దారు. ఈ పనులు పూర్తయితే అనకాపల్లి జిల్లాలోని ప్రధాన ఆయకట్టుకు సాగునీరు అందడమే కాకుండా, విశాఖ పరిధిలోని పారిశ్రామిక అవసరాలకు ఉచితంగా తాగు, పారిశ్రామిక నీరు సరఫరా కానుందిఈ రెండు కీలక ప్రాజెక్టులు అందుబాటులోకి రావడం వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై సానుకూల ప్రభావం పడనుంది. విశాఖ, అనకాపల్లి పారిశ్రామిక ప్రాంతాలకు నీటి భద్రత లభిస్తే మరిన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్లు రాష్ట్రానికి తరలివస్తాయి. అదే సమయంలో, తీవ్ర ఫ్లోరైడ్ సమస్యతో అల్లాడుతున్న ప్రకాశం జిల్లా గ్రామాలకు కృష్ణా జలాలు అందడం ద్వారా వేలాది మందికి శాశ్వత ఆరోగ్య లబ్ధి చేకూరుతుంది. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు ఎదురైనా ఈ ప్రాజెక్టుల ద్వారా నీటిని నిల్వ చేసి సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వం లెక్కిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాటల కంటే పనులకే ప్రాధాన్యత ఇస్తుందనే సందేశాన్ని ఈ ప్రాజెక్టుల వేగం చాటిచెబుతోంది. గత ప్రభుత్వంలో మందగించిన మౌలిక రంగాన్ని మళ్లీ పట్టాలెక్కించడం ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పునరుద్ధరించడమే కాకుండా, రాబోయే రోజుల్లో 'వాటర్ మేనేజ్‌మెంట్'లో ఏపీని దేశానికే మోడల్‌గా నిలబెట్టాలనే ఆలోచనలో చంద్రబాబు ఉన్నారు. ఒకే వారంలో రెండు అతిపెద్ద ప్రాజెక్టులలో మైలురాళ్లను అధిగమించడం రాష్ట్ర జల వనరుల రంగానికి కొత్త ఊపిరి పోసిందనే చెప్పాలి.

# హీట్ పుట్టిస్తున్న పులివెందుల

కడప ఆగస్టు 29, ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాయలసీమ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో సరికొత్త పొలిటికల్ హీట్ మొదలైంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి దశాబ్దాలుగా తిరుగులేని కోటగా, అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సొంత గడ్డగా ఉన్న పులివెందుల మున్సిపాలిటీని ఈసారి ఎలాగైనా కైవసం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా సానుకూల వాతావరణం నెలకొనడంతో.. పులివెందుల పురపాలక సంఘంపై పసుపు జెండా ఎగురవేయడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది.ఈ మెగా పొలిటికల్ మిషన్‌ను విజయవంతం చేసేందుకు టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి క్షేత్రస్థాయిలో సీరియస్ ఫోకస్ పెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందులలోని ప్రతి వార్డులోనూ కూటమి శ్రేణులను ఏకం చేస్తూ, వైకాపాకు గట్టి పోటీ ఇచ్చే బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఆయన వ్యూహాత్మకంగా కసరత్తులు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో వైకాపా అవినీతిని, గత ఐదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ.. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళుతున్నారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పూర్తి మద్దతుతో బీటెక్ రవి దూసుకుపోతుండటం ఇక్కడి రాజకీయాలలో ఊహించని మార్పులకు దారితీస్తోంది. రాజకీయ విశ్లేషకుల అంచనాల ప్రకారం.. ఈసారి పులివెందుల మున్సిపాలిటీని కాపాడుకోవడం వైఎస్ జగన్‌కు అంత సులువైన వ్యవహారం కాదు. గత స్థానిక ఎన్నికల్లో అధికార బలంతో ఏకగ్రీవాలు చేసుకున్న వైకాపాకు, ఈసారి కూటమి ప్రభుత్వం వంద శాతం పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తుండటం పెద్ద సవాల్‌గా మారింది. నియోజకవర్గంలో చాలామంది వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు, సామాన్య ఓటర్లు కూటమి వైపు మొగ్గు చూపుతుండటంతో జగన్ కోటలో బీటలు వారుతున్నాయి. పులివెందుల మున్సిపాలిటీని ఎలాగైనా గెలిచి జగన్ సొంత నియోజకవర్గంలోనే ఆయనకు రాజకీయంగా పెద్ద షాక్ ఇవ్వాలని కూటమి కూకటివేళ్లతో కష్టపడుతోంది.

# వారసులొస్తున్నారు.....

విజయవాడ, ఆగస్టు 29, ఏపీలో స్థానిక సమరానికి రంగం సిద్ధమవుతున్న వేళ రాజకీయ పార్టీల్లో కొత్త సమీకరణాలు మొదలైనట్లు కనిపిస్తోంది. అక్టోబరులో కొత్త ఓటర్ల జాబితా విడుదల కానున్న నేపథ్యంలో అంతకంటే ముందే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల, జిల్లా పరిషత్‌లు, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో పార్టీల్లో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలైందిఈసారి స్థానిక ఎన్నికలను అధికార కూటమితో పాటు వైసీపీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో బలమైన అభ్యర్థుల కోసం అన్వేషణ జరుగుతోంది. అయితే ఈసారి మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వస్తోంది. సీనియర్ నేతలు తమ స్థానంలో కుటుంబ సభ్యులను రాజకీయాల్లోకి తీసుకురావడానికి స్థానిక ఎన్నికలను అనుకూల వేదికగా చూస్తున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా మేయర్, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ వంటి కీలక పదవులకు తమ కుమారులు, కుమార్తెలను పోటీ చేయించాలనే ఆలోచనలో పలువురు నేతలు ఉన్నట్లు సమాచారం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కష్టమైన పరిస్థితుల్లో స్థానిక ఎన్నికలు వారసులకు రాజకీయ అరంగేట్రం చేయించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పైగా ఎన్నికల్లో ఆర్థికంగా, రాజకీయంగా పూర్తి స్థాయిలో సహకరించగల వ్యక్తిని బరిలోకి దించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యుల వైపు మొగ్గు చూపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పలువురు సీనియర్ నాయకులు తమ వారసులకు టికెట్లు ఇప్పించేందుకు ప్రయత్నించారు. టీడీపీ , వైసీపీ రెండింటిలోనూ ఇలాంటి ఆశలు ఉన్నప్పటికీ, ఎన్నికల సమీకరణాలు, గెలుపు అవకాశాలను దృష్టిలో పెట్టుకునిఅన్ని చోట్లా వారసులకు అవకాశం ఇవ్వలేదు. అయినప్పటికీ యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య, టీజీ వెంకటేశ్ కుమారుడు భరత్, పేర్ని నాని కుమారుడు కిట్టూ, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు మోహిత్ వంటి వారికి రాజకీయ అవకాశం లభించింది.అదే సమయంలో పలువురు సీనియర్ నేతల వారసులకు మాత్రం గత ఎన్నికల్లో టికెట్లు దక్కలేదు. దీంతో ఇప్పుడు స్థానిక ఎన్నికలపై వారు ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, జడ్పీ చైర్మన్ వంటి పదవులు రాజకీయంగా మంచి గుర్తింపు ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో పెద్ద పదవులకు వెళ్లేందుకు బలమైన పునాది అవుతాయని భావిస్తున్నారు.ఈ విషయంలో వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఇప్పటికే ముందడుగు వేశారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమార్తె అనూషను విజయనగరం జడ్పీ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా వారసత్వ రాజకీయాలకు స్థానిక ఎన్నికలే తదుపరి వేదిక అన్న సంకేతం ఇచ్చారని కొందరు భావిస్తున్నారు. దీంతో ఇతర జిల్లాల్లోని సీనియర్ నాయకులు కూడా తమ కుటుంబ సభ్యుల రాజకీయ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఎన్నికల షెడ్యూల్ స్పష్టమైన తర్వాత ఈ వారసుల

# బీజేపీ, అకాలీదళ్ పొత్తు

ఛండీఘడ్, ఆగస్టు 29, పంజాబ్ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈసారి ఎలాగైనా అక్కడ అధికారం చేజిక్కించుకోవాలని పావులు వేగంగానే కదుపుతోంది. అయితే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి బీ.ఎల్. సంతోష్ ఓ కీలక ప్రకటన చేశారు. తాము ఒంటరిగానే బరిలోకి దిగుతామని ప్రకటించారు. అయినా? అటు బీజేపీ, ఇటు అకాలీదళ్ పొత్తు కోసం ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. అడపా దడపా ఇరు పార్టీల మధ్య చర్చలు జరుగుతూనే వున్నాయి. కానీ.. ఓ పట్టాన తుది దశకు రావడం లేదు.ఇంత జరుగుతున్నా.. పొత్తుపై రెండు పార్టీలూ ఎటూ తేల్చుకోలేకపోతున్నాయి. అయితే.. ఇరు పార్టీల మధ్య పొత్తు వుండాలన్న తుది నిర్ణయానికి మాత్రం వచ్చేశాయి. ఈ సారి బీజేపీ అక్కడ పై చేయి సాధించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తానే సీనియర్ భాగస్వామిగా వ్యవహరించాలని డిసైడ్ అయ్యింది. దీంతో అకాలీదళ్ అటూ ఇటూగా వున్నట్లు తెలుస్తోంది. బీజేపీ సీనియర్ భాగస్వామి అయితే మాత్రం సీట్ల విషయంలో దెబ్బే.. అన్నట్లుగా ఆలోచిస్తోంది. ఎక్కువ సీట్లు అడగడానికి అకాలీదళ్ కి ఛాన్స్ వుండకపోవచ్చు.అయితే.. పొత్తుకు అవకాశం ఉందనడానికి ఒక కీలక సూచన ఏమిటంటే, గ్రామీణ ప్రాంతాల్లోని సీట్లకు సిద్ధం కావద్దని ఎస్ఏడీ తమ నాయకులకు సూచించినట్లు సమాచారం. దీనిని బట్టి, గత పొత్తులో కంటే బీజేపీ ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇంతలో, పంజాబ్‌లో బీజేపీ తన సంస్థాగత సన్నాహాలను ముమ్మరం చేసింది. ఇటీవల ఆ రాష్ట్రంలో పర్యటించిన సందర్భంగా, మొత్తం 117 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సన్నద్ధం కావాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్. సంతోష్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.అకాలీ దళ్ మరియు బీజేపీలు దీర్ఘకాల మిత్రపక్షాలుగా ఉన్నాయి, అయితే వివాదాస్పదమైన మూడు వ్యవసాయ చట్టాల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా సెప్టెంబర్ 2020లో అవి విడిపోయాయి.ఇవి కలిసి ఆరు లోక్‌సభ (1998, 1999, 2004, 2009, 2014 మరియు 2019) మరియు ఐదు పంజాబ్ అసెంబ్లీ (1997, 2002, 2007, 2012 మరియు 2017) ఎన్నికలలో పోటీ చేశాయి. విడివిడిగా పోటీ చేసిన 2022 పంజాబ్ ఎన్నికలలో, అకాలీ దళ్ కేవలం మూడు స్థానాలను మాత్రమే గెలుచుకుని దారుణంగా పడిపోయింది. బీజేపీ రెండు స్థానాలనే గెలుచుకుంది.

# ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ

హైదరాబాద్ ఆగస్టు 29, తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాదు.. వెంటనే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేసి.. రాజీనామా లేఖను శాసనమండలి ఛైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించింది.

ఈ మేరకు ఎంఐఎం సంయుక్త కార్యదర్శి ఎస్.ఏ. హుస్సేన్ అన్వర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఐఎం ప్రకటించిన వివరాల ప్రకారం.. మిర్జా రహ్మత్ బేగ్‌ను పార్టీ నుంచి తక్షణమే బహిష్కరించారు. అయితే ఆయనపై ఇంత కఠిన చర్య తీసుకోవడానికి దారితీసిన వీడియో లీక్ వివాదానికి సంబంధించిన పూర్తి వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు.

దీంతో అసలు వ్యవహారం ఏమిటన్నదానిపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.రహ్మత్ బేగ్‌పై పార్టీ చర్యలకు వీడియో లీక్ వ్యవహారమే కారణమని ప్రస్తుతం ప్రచారం జరుగుతోంది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పలు ఆరోపణలకు ఇప్పటివరకు అధికారిక ధ్రువీకరణ లేదు. ఇటీవలే రహ్మత్ బేగ్ తనపై డీప్‌ఫేక్, మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలను బయటపెడతామంటూ కొందరు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరించారని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి.ఈ పరిణామం జరిగిన మరుసటి రోజే ఎంఐఎం ఆయనను పార్టీ నుంచి బహిష్కరించి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని ఆదేశించడం మరింత ఆసక్తిని రేపుతోంది. అయితే డీప్‌ఫేక్ బెదిరింపుల కేసు, పార్టీ బహిష్కరణ నిర్ణయానికి నేరుగా సంబంధం ఉందని ఎంఐఎం అధికారికంగా ప్రకటించలేదు.

2023లో హైదరాబాద్ స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి మిర్జా రహ్మత్ బేగ్ ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2029 మే వరకు కొనసాగాల్సి ఉంది. అయితే పార్టీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఆయన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ ఆదేశాల మేరకు మండలి ఛైర్మన్‌కు మిర్జా రహ్మత్ బేగ్ రాజీనామా సమర్పిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.ఇదిలా ఉండగా.. పార్టీ క్రమశిక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు కూడా ఇప్పుడు చర్చకు వస్తున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, కార్యకర్తలు అనే తేడా లేకుండా పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఇక రహ్మత్ బేగ్ ఇటీవల సౌదీ అరేబియాకు వెళ్లినట్లు.. అక్కడి నుంచి పార్టీ ఆదేశాల నేపథ్యంలో తిరిగి హైదరాబాద్‌కు వచ్చినట్లు పలు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఆయనను ఎందుకు అత్యవసరంగా హైదరాబాద్‌కు రప్పించారనే విషయంపై అధికారికంగా స్పష్టత లేదు. ఈ అంశంపై కూడా పార్టీ నుంచి పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.మొత్తంగా ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ బహిష్కరణ, ఆయనకు పార్టీ నుంచి వచ్చిన రాజీనామా ఆదేశాలు, మరోవైపు డీప్‌ఫేక్ వీడియోల పేరుతో వచ్చిన బెదిరింపులు ప్రస్తుతం హైదరాబాద్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే సోషల్ మీడియాలో ప్రచారంలో వైరల్ అవుతున్న ఆరోపణలను వాస్తవాలుగా పరిగణించకుండా.. పార్టీ అధికారిక ప్రకటనలు, పోలీసుల దర్యాప్తు ఆధారంగా మాత్రమే తదుపరి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

# కవిత హరీష్ ను ఎందుకు టార్గెట్ అయ్యారు...

హైదరాబాద్ ఆగస్టు 29, బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రక్షణ సేన అనే సరికొత్త వేదికను ఏర్పాటు చేసినప్పటి నుంచి కల్వకుంట్ల కవిత తన ప్రధాన రాజకీయ అస్త్రాన్ని హరీష్ రావు వైపే గురిపెట్టారు. సాధారణంగా ప్రతిపక్షాలు , పొలిటికల్ శత్రువులపై చేసే విమర్శలకు భిన్నంగా.. కేసీఆర్ ఆరోగ్యం క్షీణించడానికి హరీష్ రావే కారణమని, ఆయన క్షుద్రపూజలు చేయిస్తున్నారంటూ ఆమె చేసిన సంచలన ఆరోపణలు రాజకీయ సరిహద్దులను దాటేశాయి. చాలా కాలం కలసి పని చేసిన, పైగా సమీప బంధువు అయిన మాజీ మంత్రిపై కవిత ఇంతటి తీవ్రమైన పొలిటికల్ ఎటాక్‌కు దిగడం వెనుక ఒక సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందని భావిస్తున్నారు. కవిత ప్రధాన లక్ష్యం?బీఆర్ఎస్ గులాబీ శ్రేణుల్లోను, కేసీఆర్ కుటుంబంలోనూ హరీష్ రావుపై కోలుకోలేని స్థాయిలో అపనమ్మకాన్ని పెంచడమే. కవిత అరెస్టు కావడం, ఆ తర్వాత పార్టీలో ఆమెకు ప్రాధాన్యత తగ్గడం, చివరికి కేసీఆర్ ఆమెను పక్కన పెట్టేలా జరిగిన పరిణామాల వెనుక హరీష్ రావే సూత్రధారి అనే బలమైన నమ్మకం ఆమెలో ఉంది. అందుకే హరీష్‌ను పార్టీలో ఒంటరిని చేసి, ఆయన బిఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేలా వాతావరణం సృష్టించాలని అనుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. కవిత వ్యూహం కేవలం వ్యక్తిగత కోపం కాదు. బీఆర్ఎస్ క్యాడర్ , కేసీఆర్ ఆత్మీయుల దృష్టిలో హరీష్‌ను విశ్వాసఘాతకుడిగా ముద్ర వేయడం ద్వారా, పార్టీపై హరీష్ పట్టును సడలించాలనేది ఆమె వేసిన పక్కా ప్లాన్ అనుకోవచ్చు. టీఆర్ఎస్‌లో కేసీఆర్ తర్వాత క్షేత్రస్థాయిలో, క్యాడర్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన నేత హరీష్ రావు. ఒకవేళ హరీష్ పార్టీ నుంచి నిష్క్రమిస్తే.. పార్టీపై, గులాబీ కేడర్‌పై కేసీఆర్ కుటుంబం ఆధిపత్యం తిరుగులేనిదిగా మారుతుంది. అయితే ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి కవిత దూరమయ్యారు. కేటీఆర్ దే ఆధిపత్యం అవుతుంది. అయితే కేటీఆర్ వద్ద అసలు నాయకత్వ లక్షణాల్లేవని కవిత అంటున్నారు. హరీష్ రావు గనక బీఆర్ఎస్ నుంచి బయటకు వస్తే, గులాబీ పార్టీ బలహీనపడుతుంది. అప్పుడు బీఆర్ఎస్‌లోని అసంతృప్త నేతలకు, కేడర్‌కు కవిత పార్టీ ఒక ప్రధాన ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంటుంది. కేసీఆర్ కు ఇప్పటికీ అత్యంత ఆప్తుడిగా, నమ్మకస్తుడిగా హరీష్ ఉండటాన్ని కవిత తట్టుకోలేకపోతున్నారు. హరీష్‌ను పార్టీకి దూరం చేయగలిగితే, మళ్లీ కేసీఆర్ మనసు గెలుచుకుని, అవసరమైతే భవిష్యత్తులో బీఆర్ఎస్‌ను తన వేదికతో విలీనం చేసి రీ-ఎంట్రీ ఇవ్వవచ్చనే ఆలోచన కూడా ఆమెలో ఉండి ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే కవిత వేస్తున్న ఈ పావులు ఎంతవరకు పారుతాయనేది సందేహాస్పదమే. హరీష్ రావు దశాబ్దాలుగా గ్రౌండ్ లెవెల్ రాజకీయాలు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో నిర్మించిన నాయకుడు. కవిత చేసే క్షుద్రపూజల ఆరోపణలను సామాన్య ప్రజలు లేదా తీవ్రస్థాయి గులాబీ కేడర్ ఎంతవరకు నమ్ముతారనేది ప్రశ్నార్థకం. పైగా కేటీఆర్ కూడా ప్రస్తుతానికి హరీష్‌తో కలిసే ప్రతిపక్ష పోరాటం చేస్తున్నారు. ఒకవేళ కవిత అనుకున్నట్లుగా హరీష్ రావుపై ఈ ఆరోపణలు పనిచేసి, ఆయన బీఆర్ఎస్‌కు దూరమైతే అది కవిత తెలంగాణ రక్షణ సేన కు రాజకీయంగా ఊపిరి పోస్తుందనడంలో సందేహం లేదు. కానీ, ఇది ఉమ్మడి మెదక్, వరంగల్ వంటి ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఓటు బ్యాంకును భారీగా దెబ్బతీసి, కాంగ్రెస్ లేదా బీజేపీలకు మేలు చేసే ప్రమాదం కూడా ఉంది. ఏది ఏమైనా కవిత-హరీష్ మధ్య జరుగుతున్న ఈ సమరం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో మరిన్ని ఊహించని మలుపులకు దారితీయనుంది.

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోదీ

ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్ పర్యటనకు ప్రధాని మోదీ బయల్దేరారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు ఆయన ఈ రెండు దేశాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. సదస్సులో సభ్య దేశాల నేతలతో పలు కీలక అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారం, వాణిజ్యం, కనెక్టివిటీ వంటి అంశాలపై చర్చలు జరగనున్నట్లు తెలుస్తోంది.

# యూపీలో హై బీపీ....

లక్నో ఆగస్టు 29, (న్యూస్ పల్స్) దేశ రాజకీయాలకు దిక్సూచి లాంటి ఉత్తరప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ ఆధిపత్యం క్రమంగా సవాలును ఎదుర్కొంటోందన్న చర్చ అంతటా ఊపందుకుంది. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో తిరుగులేని జయభేరి మోగించిన బీజేపీకి.. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు షాక్ ఇచ్చారు. అక్కడితో ఆగలేదని యూపీలో కమలదళం గ్రాఫ్ ఇంకా కిందకే జారుతోందని, ప్రతిపక్ష ఇండియా కూటమి ఊపందుకుంటోందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో 2027లో జరగబోయే అసెంబ్లీ సమరంలో బీజేపీకి హ్యాట్రిక్ విజయం సులభం కాదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.యూపీలో బీజేపీకి ప్రధానమైన ప్లస్ పాయింట్ యోగి ఆదిత్యనాథ్ బుల్డోజర్ మార్కు పాలన, పటిష్టమైన శాంతిభద్రతలు, కేంద్ర-రాష్ట్ర సంక్షేమ పథకాలు. అయితే దశాబ్దకాలపు ప్రభుత్వ వ్యతిరేకత , యువతలో పెరుగుతున్న నిరుద్యోగిత, పేపర్ లీకేజీల నిరసనలు, ద్రవ్యోల్బణం క్షేత్రస్థాయిలో ఓటర్లలో అసంతృప్తిని పెంచుతున్నాయి. వీటికితోడు ఓటర్లలో కనిపించే అలసట, స్థానిక నాయకులపై అసంతృప్తి పార్టీ స్థానాలు పడిపోవడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కేవలం మతపరమైన ధ్రువీకరణ లేదా నరేంద్ర మోదీ-యోగి ఆదిత్యనాథ్‌ల ఇమేజ్‌పైనే ఆధారపడటం యూపీలో ఇక వర్కవుట్ కాదనేది క్షేత్రస్థాయి ఓటర్లు ఇస్తున్న స్పష్టమైన సంకేతంగా కనిపిస్తోంది. మరోవైపు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ రూపకల్పన చేసిన పిడిఏ వ్యూహం అంటే వెనుకబడిన తరగతులు, దళితులు, అల్పసంఖ్యాక వర్గాలు సోషల్ ఇంజనీరింగ్ వ్యూహం యూపీలో అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. గతంలో కేవలం యాదవ్-ముస్లిం సమీకరణలకే పరిమితమైన ఎస్పీ, ఇప్పుడు నాన్-యాదవ్ ఓబీసీలు, నాన్-జాతవ్ దళిత వర్గాలను తమవైపు తిప్పుకోవడంలో విజయం సాధించింది. కాంగ్రెస్‌తో జతకట్టి ఇండియా కూటమిగా పోటీచేస్తుండటంతో ఓట్లు చీలిపోకుండా ప్రతిపక్షం అత్యంత బలంగా నిలబడగలుగుతోంది. ఇక బీజేపీ అంతర్గత విభేదాలు, సమాజ్‌వాదీ పార్టీ బలపడటమే కాకుండా.. కుల గణన డిమాండ్లు, స్థానిక బీసీ నేతల అసంతృప్తి కమలనాథులను వేధిస్తున్నాయి.అయితే బీజేపీని తేలికగా తీసిపారేయడానికి వీల్లేదు. ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయి నెట్‌వర్క్, బీజేపీ ఓటు బ్యాంకు మేనేజ్‌మెంట్ , ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్‌కు ఇప్పటికీ ఉన్న వ్యక్తిగత క్రేజ్ ఆ పార్టీకి అతిపెద్ద అడ్వాంటేజ్. యూపీలో బీజేపీ పరిస్థితి పూర్తిగా దిగజారకపోయినా, ఒకప్పటి ఏకపక్ష విజయాల శకం మాత్రం ముగిసిపోయింది. 2027 అసెంబ్లీ ఎన్నికల నాటికి నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, బీసీ వర్గాల ఆందోళనలను పరిష్కరించి.. నష్టనివారణ చర్యలు చేపట్టకపోతే యూపీ పీఠాన్ని కాపాడుకోవడం బీజేపీకి అత్యంత కఠినమైన సవాలుగా మారనుందన్నది ఎక్కువ మంది అభిప్రాయం.

## 30న జరిగే 'నీట్ - పీజీ' పరీక్ష కు భారీ బందోబస్తు

### - నిబంధనలు మీరితే కఠిన చర్యలు:

### - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

### అన్నమయ్య జిల్లా - మదనపల్లె



ఈ నెల 30న ఆదివారం మదనపల్లె (మిట్స్, ఆదిత్య), రాయచోటి (శ్రీ సాయి, భాస్కర్) ఇంజనీరింగ్ కళాశాల కేంద్రాల్లో ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు నీట్ - పీజీ పరీక్ష జరుగుతుంది; ఉదయం 8.30 గంటల తర్వాత ఎవరినీ అనుమతించరు.భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రాల చుట్టూ 200-300 మీటర్ల పరిధిలో సెక్షన్ 163 ఃఔొూ అమలులో ఉంటుంది; ఆ పరిధిలోని జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలి.కేంద్రాల్లోకి మొబైల్స్, ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధం; పేపర్ లీక్ వదంతులు సృష్టించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన క్రిమినల్ చర్యలు తప్పవని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి హెచ్చరించారు.

# కారు గేరు మార్పు...

హైదరాబాద్, ఆగస్టు 29, తెలంగాణలో బీఆర్ఎస్ స్పీడ్ పెంచింది. ఎన్నికల సమయంతో సంబంధం లేకుండా నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తుంది. ప్రధాన ప్రతిపక్షమైన భారత్ రాష్ట్ర సమితి అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై తన రాజకీయ పోరాట వేగాన్ని గణనీయంగా పెంచింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా కాంగ్రెస్ తన ఎన్నికల హామీలను నెరవేర్చలేదనే ప్రధాన అజెండాతో బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు తెలియజేసింది. ఏదో ఒక ఆందోళన చేస్తూ ప్రతి రోజూ ప్రభుత్వం పంటి కింద రాయిలా తయారయింది. జనం వాయిస్ ను రైజ్ అయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను నిర్వహిస్తుంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ప్రతి రోజూ ఏదో ఒక అంశంపై బీఆర్ఎస్ ఆందోళనకు దిగుతుంది. వరసగా బీఆర్ఎస్ చేస్తున్న ఆందోళనలతో కొంత ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లయింది. భూ కబ్జాలు, 22 ఎ వివాదం, హైడ్రా కూల్చివేతలు, తాజాగా విద్యార్థుల పక్షాన పోరుబాట పట్టింది. పాలిటెక్నిక్ విద్యార్థులకు అండగా బీఆర్ఎస్ నిలబడింది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు నిత్యం జనంలోనే ఉంటున్నారు. తొలుత వెయ్యి రోజుల పాలనపై 'పోరుబాట'కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న తెలంగాణ భవన్‌లో ప్రభుత్వ వైఫల్యాలపై అధికారికంగా ఛార్జ్‌షీట్ విడుదల చేయనున్నారు.కాంగ్రెస్ అమలు చేయని హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "బాకీ కార్డ్స్" ప్రచారాన్ని తిరిగి ప్రారంభించారు.వినూత్న నిరసనల షెడ్యూల్ లు రం రోజుల పాటు వివిధ వర్గాల సమస్యలపై బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రపంచపటాలు పరిశీలించండిసెప్టెంబర్ 3న వ్యవసాయం, రుణమాఫీ, ఉచిత విద్యుత్ సమస్యలపై రైతు సమావేశాలు నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 4న మహిళా సమస్యలు, వంటావార్పు కార్యక్రమాలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 5న రూ. 12,000 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ క్యాలెండర్ ఆలస్యంపై భారీ ర్యాలీలు నిర్వహించనుంది. సెప్టెంబర్ 6న నగరంలో తాగునీరు, మౌలిక సదుపాయాల కొరతపై ఆటోలతో నిరసన తెలియజేయనుంది. సెప్టెంబర్ 7, 8 తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాల సమర్పించనుంది. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన 22ం నిషేధిత జాబితా సమస్య వల్ల సామాన్య ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై హరీష్ రావు న్యాయ విచారణ కోరుతూ సభను స్తంభింపజేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మరియు వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను చైతన్యపరుస్తూ తన రాజకీయ వేగాన్ని అంచెలంచెలుగా పెంచుతోంది.

## మీరే డ్రా తీసుకుంటే ఇక ఎమ్మెల్యే ఎందుకు

## హౌసింగ్ బోర్డు అధికారులపై ఎమ్మెల్యే దానం మండిపాటు



హైదరాబాద్ హౌసింగ్ బోర్డు అధికారులపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. తాను వచ్చేలోపే గృహలక్ష్మి లక్కీ డ్రా ప్రారంభించడంపై మండిపడ్డారు. ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగకుండా డ్రా ఎలా ప్రారంభిస్తారని అధికారులపై విరుచుకపడ్డారు. మీరే డ్రా తీసుకుంటే ఒక నేనేందుకని నిలదీసారు. కార్యక్రమం మధ్యలోనే అలిగి వెళ్లిపోయారు. బంజారాహిల్స్ కొమరం భీమ్ ఆదివాసీ భవన్లో ఘట చోటు చేసుకుంది.

# కమలం వైపు కొండా చూపు

హైదరాబాద్, ఆగస్టు 29, తెలంగాణ రాజకీయంలో దశాబ్దాలుగా తమకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించుకున్న కొండా సురేఖ - మురళి దంపతుల రాజకీయ ప్రస్థానం ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీ అధిష్ఠానానికి, స్థానిక ఎమ్మెల్యేలకు కంటిమీద కునుకు లేకుండా చేశారు. సొంత పార్టీలోనే సొంత సహచరులు కొండాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తుండటంతో, వారి కాంగ్రెస్ ప్రయాణం దాదాపు క్లైమాక్స్‌కు చేరిందనే చర్చ జోరందుకుంది. గతంలో బీఆర్ఎస్ శ్రేణులతో తీవ్రస్థాయిలో శత్రుత్వం పెంచుకుని ఆ పార్టీని వీడి రావడం, కెటిఆర్ , బిఆర్ఎస్ అధినాయకత్వంపై తీవ్ర విమర్శలు చేయడంతో తిరిగి కేసీఆర్ గూటికి వెళ్లే తలుపులు పూర్తిగా మూసుకుపోయాయి. ఇక మిగిలిన ఒకే ఒక ప్రధాన జాతీయ ప్రత్యామ్నాయం బీజేపీ . ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుదీర్ఘ రాజకీయ అనుభవం, సొంత కేడర్ ఉన్న కొండా దంపతులకు ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో బీజేపీ వైపు చూడక తప్పని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్‌లో విమర్శల సెగ, బీఆర్ఎస్‌తో మూసుకుపోయిన తలుపులు.. ఇప్పుడు కొండా దంపతులకు మిగిలిన ఒకే ఒక ప్రధాన ద్వారం బీజేపీ! అయితే క్రమశిక్షణకు ప్రాధాన్యమిచ్చే కమలం పార్టీలో వీరి దూకుడు నైజంతో ఉండగలరా అన్నది కూడా అప్పుడే అందరికీ వస్తున్న సందేహం. మరోవైపు తెలంగాణలో బలమైన బీసీ నాయకత్వం కోసం శోధిస్తున్న బీజేపీకి కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టున్న బిసి నేతలు అవసరం ఎంతైనా ఉంది. బలమైన బీసీ సామాజిక వర్గాలకు చెందిన కొండా జంటను చేర్చుకోవడం ద్వారా వరంగల్, పరకాల, భూపాలపల్లి నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయవచ్చని బీజేపీ భావించే అవకాశం ఉంది. ఈ వ్యూహంలో భాగంగానే, ముందస్తుగా కుమార్తె సుస్మితను బీజేపీలోకి పంపి, ఆ తర్వాత శాసనసభ ఎన్నికల సమయానికి సురేఖ-మురళి దంపతులు నేరుగా కమలం గూటికి చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, అసలు సమస్యల్లా కొండా దంపతుల ఫైర్‌బ్రాండ్ పొలిటికల్ స్టైల్. కాంగ్రెస్, వైఎస్సార్సీపీ, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ, ప్రజాస్వామ్య వాతావరణం ఉన్న పార్టీలలో వారు చూపించిన స్వతంత్ర వైఖరి, దూకుడు రాజకీయం బీజేపీ కల్చర్‌కు పూర్తిగా భిన్నమైనవి. బీజేపీ అనేది కేంద్ర నాయకత్వం, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, ఖచ్చితమైన పార్టీ క్రమశిక్షణ ఆధారంగా నడిచే సంస్థ. పార్టీ గీత దాటి మాట్లాడితే ఎంతటి నేతలనైనా పక్కన పెట్టే నైజం బీజేపీది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో సొంత సీఎంపైనే తిరుగుబాటు బావుటా ఎగరేసినట్లుగా ముద్రపడిన కొండా దంపతులు, బీజేపీలోని విధివిధానాలకు అలవాటు పడి ఇమడగలరా అన్నది పెద్ద ప్రశ్నార్థకం. వరంగల్ జిల్లా బీజేపీలో ఇప్పటికే ఉన్న స్థానిక నేతలతో కొండా దంపతులకు ఆధిపత్య పోరు తప్పకపోవచ్చు. ఏది ఏమైనా, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి బీజేపీ లోకి అడుగుపెట్టడం ఒక ఎత్తయితే, అక్కడి కట్టుబాట్లను తట్టుకుని నిలబడటం కొండా దంపతులకుఅతిపెద్ద సవాలుగా మారనుంది..

**జనసేనలోకి సుస్మిత**

రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మితతో పాటు రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతలు సొంత పార్టీపై విమర్శలు చేశారు. తాజాగా.. రాష్ట్ర రాజకీయాల్లో మరో ఆసక్తికర ప్రచారం తెరపైకి వచ్చింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత పరిణామాలు, పరకాల రాజకీయాల నేపథ్యంలో ఆమె జనసేన వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఈ ప్రచారాన్ని సుస్మితగానీ, జనసేనగానీ ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. కొండా కుటుంబానికి కాంగ్రెస్ నేతలతో పొసగటం లేదు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న సుస్మిత ఆకాంక్ష ఈ పరిణామాలకు కేంద్రంగా మారినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో పరకాల టికెట్ తనకు దక్కాలని ఆమె కోరుకుంటున్నారు. తానే అక్కడి నుంచి పోటీ చేస్తానని.. పార్టీ నుంచి అవకాశం రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఇప్పటికే ప్రకటించారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో వివాదానికి దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై మంత్రి సురేఖ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఈ పరిణామాలకు జనసేన అంశం కూడా జత కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. తెలంగాణలో తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునే దిశగా జనసేన క్రమంగా కార్యాచరణను విస్తరిస్తోంది. ముఖ్యంగా యువత, కొత్త రాజకీయ శక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న వ్యూహంలో భాగంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సుస్మితతో జనసేన నేతలు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రకటించడం కూడా తెలంగాణలో పార్టీ విస్తరణపై చర్చకు దారితీసింది.

# ప్రైమ్ ల్యాండ్ లో అమ్మకాలకు ప్లాన్

హైదరాబాద్, ఆగస్టు 29, రాయదుర్గంలో నిర్వహించిన భూముల ఇ-వేలంలో ఎకరం ఏకంగా రూ. 264 కోట్ల ఆల్-టైమ్ రికార్డు ధర పలకడంతో ఊపుమీదున్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ మరోసారి నగర పరిధిలోని ప్రైమ్ ల్యాండ్ పార్సెళ్లు, రెసిడెన్షియల్ లేఅవుట్లను వేలానికి ఉంచేందుకు సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా భారీగా ఆదాయం సమీకరించడంతో పాటు, పారదర్శకమైన టైటిళ్లతో డెవలపర్లు, కొనుగోలుదారులకు ల్యాండ్ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నోటిఫికేషన్లు జారీ చేసింది. ఐటీ, ఫైనాన్షియల్ కారిడార్‌లో హాట్ కేకులా మారిన కోకాపేట్‌లోని నియోపోలిస్ ప్లాట్ నెం. 17 ? 4.59 ఎకరాలు ల్యాండ్ పార్సెల్‌కు సంబంధించి రీ-ఆక్షన్ నిర్వహించేందుకు హెచ్ఎండీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి కనీస ప్రారంభ ధర గా ఎకరానికి రూ. 120 కోట్లు నిర్ణయించడంతో రియల్ ఎస్టేట్ దిగ్గజాల దృష్టి అంతా మళ్లీ కోకాపేట్‌పైనే పడింది. దీనితో పాటు గోల్డెన్ మైల్‌లోని 0.70 ఎకరాల స్థలాన్ని ఎకరానికి రూ. 70 కోట్ల అప్‌సెట్ ధర కూడా సెప్టెంబర్ 9న ఇ-వేలం వేసేందుకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరోవైపు నగరంలో సొంతింటి స్థలం కొనుక్కోవాలనుకునే వారిని దృష్టిలో ఉంచుకుని పశ్చిమ, ఉత్తర ప్రాంతాల్లోని వ్యూహాత్మక లేఅవుట్లను వేలానికి తీసుకొచ్చారు. పశ్చిమ కారిడార్‌లోని మోకిల లేఅవుట్‌లో చదరపు గజానికి రూ. 55,000 అప్‌సెట్ ధరగా నిర్ణయించగా, ఐటీ కారిడార్‌కు అతిసమీపంలో ఉన్న బాచుపల్లి లేఅవుట్‌లో చదరపు గజానికి రూ. 45,000 కనీస ధరగా ఖరారు చేశారు. అలాగే అవుటర్ రింగ్ రోడ్ కనెక్టివిటీ ఉన్న ఇన్ముల్ సర్వ గ్రామంలో చదరపు గజానికి రూ. 15,000గా ధర నిర్ణయించారు. ఈ భారీ భూముల అమ్మకాల ప్రక్రియ మొత్తం ఈ-కామర్స్ పోర్టల్ ద్వారా అత్యంత పారదర్శకంగా సాగనుంది. ఈ నెల ఆగస్టు 31తో రిజిస్ట్రేషన్లు , ఈఎమ్‌డీ సమర్పణ గడువు ముగియనుండగా, సెప్టెంబర్ 2న మోకిలా, బాచుపల్లి లేఅవుట్ల వేలం జరగనుంది. సెప్టెంబర్ 3న ఇన్ముల్ నర్వ, సెప్టెంబర్ 9న కోకాపేట్ నియోపోలిస్ బిడ్డింగ్ సాగనుంది. 100% వివాద రహిత ప్రభుత్వ భూములు కావడం, 100 అడుగుల రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, కరెంట్ వసతులతో హెచ్ఎండీఏ వీటిని సిద్ధం చేయడంతో ఈసారి కూడా వేలంలో సరికొత్త రికార్డులు నమోదు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

**యూనిట్ మాల్ నిర్మాణం**

తెలంగాణలోని కుటీర పరిశ్రమలు, చేనేత, హస్తకళలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు కల్పించే లక్ష్యంతో హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని రాయదుర్గంలో యూనిటీ మాల్ నిర్మాణంచేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద మంజూరైన నిధులతో ఒక జిల్లా?ఒక ఉత్పత్తి కాన్సెప్ట్‌తో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధిలోని రాయదుర్గంలో టీజీ లిప్కోకు చెందిన 6.12 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం బదలాయించింది. సుమారు 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు భారీ ట్విన్ టవర్లను నిర్మించేందుకు రూ.2,059.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఈ ప్రాజెక్టుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన ప్రత్యేక ఉత్పత్తులతోపాటు దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సంప్రదాయ వస్త్రాలు, హస్తకళలు, వ్యవసాయ ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. యూనిటీ మాల్ నిర్మాణాన్ని పబ్లిక్?ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపడుతున్నారు. లావాదేవీల సలహాదారు జేఎల్ఎల్ నేతృత్వంలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగా.. వంశీరామ్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ లీడ్ మెంబర్‌గా, అపర్ణ ఇన్‌ఫ్రా?హౌసింగ్ సభ్యునిగా ఉన్న కన్సార్టియం ప్రాజెక్టును దక్కించుకుంది. ప్రభుత్వం లెటర్ ఆఫ్ అవార్డు జారీ చేసింది. ఈ సంస్థలు యూనిటీ మాల్ అండ్ స్పేసెస్ ఎల్ఎల్‌పీ పేరుతో ఎస్పీవీ ఏర్పాటు చేసి జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ ప్రక్రియను చేపడుతున్నాయికేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు రూ.202 కోట్లు మంజూరు చేయగా.. తొలి విడతగా రూ.101 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.60 కోట్లు జీహెచ్ఎంసీ భవన నిర్మాణ అనుమతుల ఫీజులకు చెల్లించారు. ఇప్పటివరకు మొత్తం రూ.83.24 కోట్లు ఖర్చు చేశారు. వినియోగ ధ్రువపత్రాలు సమర్పిస్తూ రెండో విడత రూ.101 కోట్లు విడుదల చేయాలని టీజీటీపీసీ కేంద్రాన్ని కోరింది. ప్రాజెక్టును 2030 అక్టోబరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మాల్‌లో 33 జిల్లాల ఉత్పత్తులకు ప్రత్యేక విక్రయ కేంద్రాలతోపాటు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. చేనేత, జౌళి, గిరిజన హస్తకళలు, సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రత్యేక స్థలాలు కేటాయించనున్నారు. ప్రపంచస్థాయి ఎగ్జిబిషన్ గ్యాలరీలు, అంతర్జాతీయ సదస్సులకు మల్టీపర్పస్ కాన్ఫరెన్స్ హాళ్లు, కొనుగోలుదారులు, విక్రేతల కోసం బిజినెస్ లాంజ్‌లు, ఫుడ్‌కోర్టులు, ఆధునిక లాజిస్టిక్స్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. జీఐ గుర్తింపు పొందిన తెలంగాణ ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను విస్తరించడంతోపాటు మాల్ నిర్వహణ, విక్రయాలు, భద్రత, లాజిస్టిక్స్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. యూనిటీ మాల్ కేవలం వాణిజ్య సముదాయంగా కాకుండా గ్రామీణ ఉత్పత్తిదారులను గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానించే ఆర్థిక వేదికగా మారనుందని అంటున్నారు.

# ముందుకు సాగని కొండగట్టు అభివృద్ధి పనులు

కరీంనగర్, ఆగస్టు 29, కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నాయని, జనవరి 3న శంకుస్థాపన కూడా పూర్తయిందని పేర్కొంది. అయినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై జనసేన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. టెండర్ ప్రక్రియలో జాప్యానికి కారణం ఏంటో రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై విమర్శలు గుప్పించింది. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనుల జాప్యంపై జనసేన పార్టీ ప్రశ్నలు సంధించింది. నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసింది. కొండగట్టు భక్తుల సౌకర్యాల కోసం మంజూరైన నిధులను వినియోగించి అభివృద్ధి పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేసింది. కొండగట్టు ఆలయంలో 96 గదుల సత్రం, దీక్షా విరమణ మండపం నిర్మాణం కోసం రూ.35.19 కోట్ల తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు సిద్ధంగా ఉన్నాయని జనసేన పేర్కొంది. కొండగట్టు ఆలయ అభివృద్ధి పనులకు జనవరి 3వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అక్కడ పర్యటించి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తుచేసింది. అయితే శంకుస్థాపన పూర్తి అయి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు టెండర్ ప్రక్రియ ఎందుకు చేపట్టలేదో రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరింది. కొండగట్టు ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రతిపాదించిన నిర్మాణాలను ఆలస్యం చేయడం సరికాదని జనసేన పార్టీ అభిప్రాయపడింది. రూ.35.19 కోట్ల టీటీడీ నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ టెండర్ ప్రక్రియ ఎందుకు ముందుకు సాగడం లేదంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హిందూ భక్తుల సౌకర్యాలకు సంబంధించిన అభివృద్ధి పనులను రాజకీయ అంశంగా మార్చకుండా వెంటనే ప్రారంభించాలని జనసేన డిమాండ్ చేసింది. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది. ఈ వ్యవహారంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎందుకు స్పందించడం లేదని జనసేన పార్టీ ప్రశ్నించింది. కొండగట్టు అభివృద్ధి పనులపై ప్రజలకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్, పొన్నం ప్రభాకర్ మధ్య గతంలో చోటుచేసుకున్న రాజకీయ మాటల యుద్ధం నేపథ్యంలో తాజా విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ సభకు అనుమతి విషయంలో ఇరువురి మధ్య మాటల తూటాలు పేలాయి. అప్పటి నుంచి జనసేన పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.

# గోల్డెన్ చాన్స్...మిస్సు చేసుకుంటున్నారా...

హైదరాబాద్, ఆగస్టు 29, తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన దశకు చేరుకుంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలికి మార్పు కోరుకున్న ప్రజలు కాంగ్రెస్ చేతికి పగ్గాలు అప్పగించారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, రుణమాఫీ, రైతుభరోసా వంటి హామీల అమలులో తీవ్ర ఆర్థిక, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. మరోవైపు పరాజయ భారం, అంతర్గత కుమ్ములాటలతో బీఆర్ఎస్ తన పూర్వ వైభవాన్ని, రాజకీయ ప్రాభవాన్ని వేగంగా కోల్పోతోంది. ప్రధాన ప్రత్యర్థి బలహీనపడటం, అధికార పార్టీపై అసంతృప్తి పెరగడంతో తెలంగాణలో కమలదళానికి అద్భుతమైన రాజకీయ శూన్యత, సువర్ణావకాశం లభించాయి. కానీ, ఈ అరుదైన అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో రాష్ట్ర బీజేపీ తీవ్రంగా తడబడుతోందనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలను గెలుచుకుని బీజేపీ తన సత్తా చాటినప్పటికీ, ఆ జోష్‌ను స్థానిక సంస్థలు, అసెంబ్లీ దిశగా సుస్థిరమైన ఓటు బ్యాంకుగా మార్చడంలో పార్టీ విఫలమవుతోంది. “పదేళ్ల కేసీఆర్ పాలన చూశారు, కాంగ్రెస్ మార్పును చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి” అనే బలమైన నినాదాన్ని సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకత్వం చొరవ చూపడం లేదు. కేవలం ప్రధాని నరేంద్ర మోదీ ఇమేజ్, ఢిల్లీ పెద్దల చరిష్మాపైనే ఆధారపడుతూ కాలం గడుపుతున్నారు తప్ప.. స్థానిక సమస్యలపై క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే వ్యూహం లోపించింది. రాష్ట్ర బీజేపీ ఎదుర్కొంటున్న అతిపెద్ద లోపం.. సర్వజనామోదం పొందిన బలమైన నాయకత్వం లేకపోవడం. గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో దూకుడు హిందూత్వ నినాదం, పాదయాత్రలతో కేడర్‌లో తీవ్రమైన ఉత్సాహం కనిపించేది. కానీ ప్రస్తుతం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ.. సమష్టి పోరాటం కొరవడింది. ఎవరికి వారే స్వతంత్ర గ్రూపులను నడుపుతున్నారన్న భావన క్షేత్రస్థాయి శ్రేణుల్లో నైరాశ్యాన్ని నింపుతోంది. ఒక బలమైన ‘సీఎం ఫేస్’ను ప్రాజెక్ట్ చేయకుండా, అంతర్గత విభేదాలతో సాగుతున్న పార్టీకి ఓటర్లు రాష్ట్ర అధికారాన్ని కట్టబెట్టడం కష్టమనేది నిపుణుల మాట. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కోటను ఢీకొట్టడానికి బీజేపీ అనుసరించిన దూకుడు, కేడర్ ఆధారిత పోరాట వ్యూహం తెలంగాణలో ఎక్కడా కనిపించడం లేదు. బెంగాల్‌లో పంచాయతీ స్థాయి నుంచి ప్రతి వార్డు వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ ఒత్తిళ్లను ఎదుర్కొంటూ రోడ్లపై నిరంతరాయంగా పోరాడారు. తెలంగాణలో మాత్రం నాయకులు కేవలం ప్రెస్ మీట్లు, టీవీ డిబేట్లు, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు. రైతు భరోసా, నిరుద్యోగం, రుణమాఫీ వంటి ప్రజా సమస్యలపై సుదీర్ఘ పోరాటాలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు చేపట్టడంలో వెనుకబడుతున్నారు. వీటికితోడు బీఆర్ఎస్-బీజేపీ మధ్య అంతర్గత అవగాహన ఉందనే ప్రతిపక్షాల ప్రచారాన్ని క్లియర్ చేయడంలో కూడా స్పష్టమైన గ్రౌండ్ వర్క్ కనిపించడం లేదు. తెలంగాణలో అధికారం దక్కించుకోవాలంటే బీజేపీ తక్షణమే తన వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంది. అంతర్గత గ్రూపు తగాదాలకు ముగింపు పలికి సమష్టి నాయకత్వాన్ని ప్రదర్శించాలి. మాస్ ఇమేజ్, ప్రజాకర్షణ ఉన్న నాయకుడిని ముందుంచి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించాలి. రైతులు, నిరుద్యోగులు, మధ్యతరగతి వర్గాల సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతర ఆందోళనలు చేపట్టాలి. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఏర్పడిన ఈ రాజకీయ శూన్యతను బీజేపీ సరైన వ్యూహంతో భర్తీ చేయలేకపోతే, చేతికందిన సువర్ణావకాశాన్ని చేజేతులా చేజార్చుకున్నట్లే అవుతుంది.

# బహిష్కృత ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ ముందే వార్నింగ్ ఇచ్చాం ఓవైసీ



హైదరాబాద్ ఎంఐఎం బహిష్కృత ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ ను ఉద్దేశిస్తూ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యాలు చేసారు. మూడు రోజుల ముందే వార్నింగ్ ఇచ్చారు. మిర్జా రహ్మత్ బేగ్కు ఒక ఛాన్స్ ఉంది.. కూర్చొని మాట్లాడి ఈ సమస్యను పరిష్కరించకుంటే మంచిది. లేదంటే పార్టీలో నుంచి బహిష్కరిస్తాం.. ఆ తర్వాత నన్ను ఇలా తొలగించారు అంటే కుదరదని అయన అన్నారు.

2023లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రహ్మత్ బేగ్ పదవీకాలం 2029 మే వరకు ఉన్నప్పటికీ.. పార్టీ నిర్ణయంతో రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడుతూ మిర్జా రహ్మత్ బేగ్ పట్టుబడ్డారంటూ ఓల్డ్ సిటీ జర్నలిస్ట్ సయ్యద్ సబ్దర్ అలీ తీవ్ర ఆరోపణలు చేశారు. అత్తాపూర్‌లో కొందరు యువకులు ఆయనను పట్టుకుని కొట్టి, వీడియోలు తీశారన్నారు. ఈ విషయం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ముందే తెలుసని, అయినా రహ్మత్ బేగ్‌ను ఉమ్రాకు పంపించారని సబ్దర్ అలీ ఆరోపించారు. వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇప్పుడు ఎలాంటి కారణం చెప్పకుండా సస్పెండ్ చేశారని ఆయన విమర్శించారు.

# గుడివాడలో చిట్టీల ముసుగులో టోకరాపై పోలీసుల చర్యలు

గుడివాడ మత్స్యకార సంఘం నేత మండాది శ్రీనివాసరావు, మహాలక్ష్మి దంపతులు, కుమారుడు రేవంత్ సాయిపై వన్ టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసారు. ఇంటి సోదాల్లో కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. 32 మంది బాధితుల నుంచి రూ.51.79 లక్షల చిట్టీల మోసం జరిగినట్లు గుర్తించారు. నిందితులు మహాలక్ష్మి, కుమారుడు రేవంత్ సాయి అరెస్ట్..14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ కు పంపారు. ప్రధాన నిందితుడు శ్రీనివాసరావు కోసం గాలింపు జరుపుతున్నారు. 32 మంది చిరు మత్స్యకార కుటుంబాల సొమ్ము దోపిడీ జరిగినట్లు సమాచారం. బయటికి రాని బాధిత కుటుంబాలు ఇంకా అనేకం. 20 ఏళ్లుగా చిట్టీల వ్యాపారం పేరుతో కోట్ల ఆస్తులు కూడపెట్టారని బాధితుల ఆరోపణ. జులై 31న ఫిర్యాదు చేసినా పోలీసులు ఆలస్యంగా స్పందించారు. బాధితులకే రూ.38.60 లక్షలకు ఐపీ నోటీసులు ఇచ్చి బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపించారు.

# వేప చెట్టు విషయంలో గొడవ.. ఇద్దరు మృతి



నల్గొండ మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డ తండాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇంటి పక్కన ఉన్న వేప చెట్టు విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. గొడ్డళ్లతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఘటనా స్థలంలోమందా వెంకటేశ్వర్లు యాదవ్ మృతి చెందాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా సైదా మృతి చెందాడు. మరో ఐదుగురికి గాయాలు అయ్యాయి. ఫ్యాక్షన్ తరహాలో ఇరువర్గాలు ఇళ్లపై దాడులు చేసుకున్నాయి. విషయం తెలిసి ఘటనా స్థలానికి మేళ్లచెరువు పోలీసులు చేరుకున్నారు. ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నంతో ఆగ్రహంతో ఎస్ఐ నవీన్ పై ఒక వర్గం గొడ్డలితో దాడి చేసింది. ఎస్ఐ తలకు గాయాలు అయ్యాయి. పోలీసులు గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసారు.

# థియేటర్‌లో మద్యం సేవించి మహిళపై దాడి..

భద్రాచలం ఏషియన్ థియేటర్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది.'ఇరుముడి' సినిమా చూస్తున్న సమయంలో కొంతమంది వ్యక్తులు మద్యం సేవించి వచ్చి ఓ మహిళపై దాడికి పాల్పడినట్లు అక్కడ ఉన్న ఫ్యామిలీ ఆడియన్స్ ఆరోపిస్తున్నారు.ప్రశాంతంగా సినిమా చూడాలని కుటుంబ సభ్యులతో, చిన్నపిల్లలతో థియేటర్‌కు వచ్చిన తమకు ఇలాంటి ఘటనలతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సినిమా థియేటర్‌లో కూడా ప్రశాంతంగా సినిమా చూసే పరిస్థితి లేకపోతే ఇక కుటుంబాలతో బయటకు రావడానికి భయపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఫ్యామిలీ ఆడియన్స్ వాపోతున్నారు.ఈ ఘటనతో థియేటర్‌కు వచ్చిన మహిళలు, చిన్నపిల్లలు సైతం భయాందోళనకు గురైనట్లు తెలుస్తోంది.ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిపై థియేటర్ యాజమాన్యం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఫ్యామిలీ ఆడియన్స్ కోరుతున్నారు.ప్రశాంతంగా సినిమా చూడటానికి వచ్చిన ప్రేక్షకులకు భద్రత కల్పించాలి.. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులకు ఇబ్బంది కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రేక్షకులు కోరుతున్నారు.

## వికారాబాద్ జిల్లా...కుల్కచర్లలో ఘనంగా “ఖేలో ఇండియా సంవాద్ ? ఖేల్ కి బాత్ ఖఓ కే సాత్” కార్యక్రమం

కుల్కచర్లలో ఖేలో ఇండియా సంవాద్ ? ఖేల్ కి బాత్ ఖఓ కే సాత్”× కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం× చేశారు. ఇందులో భాగంగా ఐఖఓ ఆవణతీవవ జీనిట ఖఉ అనీశ్రీశ్రీవణవ విద్యార్థులు, అధ్యాపకులు ప్రధానమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ ×కొండా విశ్వేశ్వర్ రెడ్డి× పాల్గొన్నారు. అంతర్జాతీయ జిమ్నాస్టిక్ క్రీడాకారిణి ×సూరభి ప్రసన్న× కూడా పాల్గొని క్రీడల ప్రాధాన్యత, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించాల్సిన అవసరంపై మాట్లాడారు.ఈ కార్యక్రమంలో ×ఐఖఓ ఆవణతీవవ జీనిట ఖఉ అనీశ్రీశ్రీవణవ× కరస్పాండెంట్ ×కరణం ప్రహ్లాద్ రావు, ప్రిన్సిపాల్ × కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.××గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి విద్యార్థిని క్రీడల వైపు ప్రోత్సహించడం, వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను గుర్తించి వెలికితీయడం ఖేలో ఇండియా కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులు క్రీడల్లో ముందుకు వచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కేంద్ర ప్రభుత్వం అవసరమైన ××క్రీడా మౌలిక సదుపాయాలు, శిక్షణ మరియు ప్రోత్సాహాన్ని అందిస్తోందనితెలిపారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత క్రీడల్లో మరింతగా రాణించి దేశానికి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

# గుడివాడలో డబుల్ ఎంట్రీ ఓట్లు..

**మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన వైసిపి నాయకులు**

**నియోజకవర్గ వ్యాప్తంగా 6వేలు డబుల్ ఎంట్రీ ఓట్లు**

**పట్టణంలోనే 5వేల ఓట్లు గుర్తించిన వైసీపీ నాయకులు**

**ఆధారాలతో డబుల్ ఎంట్రీ ఓటర్ లిస్ట్ ను మున్సిపల్ కమిషనర్ కు ఇచ్చిన వైసిపి నాయకులు**

**డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ లో ఉన్న డబుల్ ఎంట్రీలను సరిచేయాలని మునిసిపల్ కమిషనర్ కు వినతిపత్రం**

ఎలక్షన్ అధికారులు రెగ్యులర్గా మీటింగ్లు పెట్టి ఒక ఓటు ఒకచోటే ఉంటుంది రెండవసారి ఆన్లైన్ అవ్వదని చెప్పిన అధికారులుఒక బూత్ లో నమోదైన ఓటు మరో బూతులో కూడా నమోదు డబుల్ ఎంట్రీ ఓట్లపై వెంటనే విచారణ చేయాలి గుడవాడ పట్టణ పరిధిలో ఇటీవల విడుదల చేసిన డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ లో ఉన్న డబుల్ ఎంట్రీలను సరిచేయాలని గుడివాడ మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ కు వైసిపి నాయకులతో కలిసి పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ వ్యాప్తంగా 6వేలు,పట్టణంలో 5 వేల డబుల్ ఎంట్రీ ఓట్ల ఉన్నట్లు ఎపిక్ నెంబర్ తో సహా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం రెగ్యులర్‌గా సమావేశాలు నిర్వహిస్తూ ఒక ఓటు ఒకచోటే ఉంటుందని రెండోసారి ఆన్‌లైన్ అయ్యే అవకాశం లేదని తెలిపారని,అయితే ఒక బూత్ లో నమోదైన ఓటు మరో బూతులు కూడా నమోదు కావడం మరికొన్ని వేరే అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదు కావడం జరిగిందన్నారు. అధికారులు డబుల్ ఎంట్రీ ఓట్లపై సమగ్ర విచారణ జరపాలని అర్హులైన ఏ ఒక్క ఓటరు హక్కు కోల్పోకుండా,అదే సమయంలో దొంగ ఓట్లు లేదా నకిలీ నమోదులు లేకుండా పారదర్శకమైన తుది జాబితాను రూపొందించాలని కోరారు.

# గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్




మేడ్చల్ జిల్లా::: గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని శామీర్ పేట పోలీసులు అరెస్ట్ చేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన బైద్నాద్ (29) అనే వ్యక్తి తన భార్య పూజా కుమారి ఇద్దరు పిల్లలతో శామీర్ పేట మండలం తూముకుంట చంద్రా రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు.తాను నివాసం ఉంటున్న ప్రాంతంలోనే పాన్ షాప్ ను నడిపి జీవనం కొనసాగిస్తున్నాడు.అధిక డబ్బులకు ఆశపడిన బైద్నాద్ బీహార్ రాష్ట్రం నుంచి 40 చాక్లెట్లతో కూడిన ప్యాకెట్ ను 200 రూపాయలకు తెచ్చి ఇక్కడ ఒక్కో ప్యాకెట్ ను 500 నుంచి ఆరు వందలకు అమ్మేవాడు.విశ్వసనీయమైన సమాచారం అందుకున్న శామీర్ పేట పోలీసులు నిన్న బైద్నాద్ ను అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి 5298 చాక్లెట్ ప్యాకెట్లు, సుమారు 25 కేజీలు ఉన్నాయని పోలీసులు తెలిపారు.నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి మీడియాకు వెల్లడించారు.కాగా నిందితుడి భార్య పూజా కుమారి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు

## “ప్రతి సవాలూ కొత్త అవకాశాన్ని తీసుకురాగలదు ప్రయత్నించండి, విజయం మీదే.””ఆత్మవిశ్వాసంతో అడుగు వేయండి? విజయమేదైనా సాధ్యమే!”

**జిల్లా ఎస్పీ తుషార్ డూడి,**



ఈ నెల 30-08-2026 (ఆదివారం)న చిత్తూరు నందు ×“హుఎఅఖ కాలేజీ, పలమనేరు నందు మథర్ తెరిస్సా కాలేజీ, కుప్పం నందు కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ మరియు ద్రవిడియన్ యూనివర్సిటీ” నందు ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 12.30 వరకు నీట్ - పీజీ పరీక్ష జరుగుతుందని, ఈ పరీక్షకు మొత్తం 594 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని జిల్లా ఎస్పీ శ్రీ తుషార్ డూడి, తెలిపారు.పరీక్షా కేంద్రాల వద్ద పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ గారు తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పరీక్షా కేంద్రాలకు చేరేందుకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నామని, పరీక్షలో పాల్గొనే విద్యార్థులు అన్ని నియమ నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా పరీక్ష రాసి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ గారు ఆకాంక్షించారు.ఈ సందర్భముగా విద్యార్థులు పరీక్షను ప్రశాంత వాతావరణంలో రాయడానికి అవసరమైన మార్గదర్శకాలను జిల్లా ఎస్పీ గారు పత్రికా ముఖాన వివరించారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు

**పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**



మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, ఎఅడఓఆ సోనిబాలదేవి, అర్జున అవార్డు గ్రహీత గాయత్రి గోపీచంద్ బ్యాడ్మింటన్ వాళ్లు ఛాంపియన్ కాన్సెప్తక విజేత త్రిష జాలి, ఆసియన్ అథ్లెట్ నందిని అగసర హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, కార్యదర్శి బీమ్ సింగ్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, క్రీడాకారులు కోచ్ లు పాల్గొన్నారు ఈ సందర్భంగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చైర్మన్ శివసేనరెడ్డి ఎండి సోనీ బాలాదేవి తో కలిసి ధ్యాన్చంద్ స్మారక” ఖేలో తెలంగాణ హాకీ లీగ్” ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించారు.

## గీత దాటిన వారిపై వెంటనే వేటు వేయకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం

**మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీలో గీత దాటిన వారిపై వెంటనే వేటు వేయకపోతే పార్టీకి నష్టమని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. క్యాబినెట్లో, ప్రభుత్వంలో మార్పులు రావాలి. కాంగ్రెస్ పార్టీలో గ్రూప్ తగాదాలు తగ్గించాలి.. పార్టీలో క్రమశిక్షణ ముఖ్యం. పెన్షన్లు రూ.4,000కి పెంచాలి, రైతు భరోసా కొనసాగించాలని అన్నారు. 22ను రద్దు చేయాలి, ఉచితాలు తగ్గించాలి. ఉద్యమకారులకు న్యాయం చేయాలి. క్యాడర్లో అసంతృప్తిని బ్యాలెన్స్ చేయాలి. ఇవన్నీ చేస్తేనే మళ్లీ అధికారంలోకి వస్తామని అన్నారు.

## పేదరికం తో మహిళ మృతి

**దహన సంస్కరలు నిర్వహించిన పోలీసులు**



కుత్బుల్లాపూర్ కొంపల్లి లోని అండర్ కన్స్ట్రక్షన్ బ్రిడ్జి కింద మృతురాలు అనిత భర్త పేరు చిన్న నితిళిజీఏజీఏజీట కి చెందిన వారు ఇక్కడే బ్రిడ్జి కింద ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉండేవారు అయితే గత కొంతకాలంగా మృతురాలు యొక్క ఆరోగ్య పరిస్థితి బాలేక ఆమెకు పసిరికలు వచ్చినవి అట్టి మహిళను ఆసుపత్రి చూపించే పరిస్థితి స్తోమత లేకపోవడంతో మృతురాలు ఈరోజు ఉదయం చనిపోవడం జరిగింది ఇట్టి విషయం తన భర్త అటుగా వెళ్లే వారి కి తెలపగా వారు 112 డైల్ చేయగా పేట్ బషీరాబాద్ పోలీస్ వారు వెళ్లి చూడగా అతనికి దహన సంస్కారాలు చేసే స్తోమత లేదని తెలిసింది , ఇట్టి విషయం ఇన్స్పెక్టర్ విజయ వర్ధన్ కి తెలుసుకొని తన సొంత ఖర్చులతో అట్టి మహిళకు దహన సంస్కారాలు నిర్వహించడం జరిగింది.

# నార్సింగిలో హిట్ అండ్ రన్

**బైక్ ను డీ కొట్టిన గుర్తు తెలియని వాహనం**

**బైక్ పై ప్రయాణిస్తున్న యువకుడు స్పాట్ డెడ్**



రంగారెడ్డి నార్సింగిలో వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఒక బైకును ఢీకొంది. ఘటనలో బైకు పై ప్రయాణిస్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మితిమీరిన వేగంతో బైక్ డీ కొట్టి ఆపకుండా వాహనం పారిపోయింది. బైక్ ను కొట్టిన వెంటనే అదుపుతప్పి ఫుట్పాత్ పై పడి యువకుడు ప్రాణాలు విడిచాడు. మృతుడు గోల్కొండకు చెందిన మహమ్మద్ అబ్దుల్ సమద్ గా గుర్తించారు. ఫస్ట్ క్లబ్ లో డెలివరీ బాయ్ గా పని చేస్తున్నాడు. నార్సింగి నుండి గండిపేట వైపు డెలివరీ తీసుకొని వెళ్తుండగా ప్రమాదం జరిగింది. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సిసి టీవీ ఫుటేజ్ ను పరిశీలిస్తున్నారు.

# అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసం తగదు

## (హెచ్.ప్రతాప్)

హైదరాబాద్ నగరం విస్తరిస్తోంది. జనాభా పెరుగుతోంది. వాహనాల సంఖ్య రోజురోజుకూ అధికమవుతోంది. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారాలు చూపాల్సిన అవసరం పాలకులపై ఉంది. అందుకే ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్లైఓవర్లు, విస్తరించిన రహదారులు వంటి మౌలిక వసతుల నిర్మాణం అనివార్యంగా మారింది. అయితే నగరాన్ని అభివృద్ధి చేసే క్రమంలో అదే నగరానికి ఊపిరినిచ్చే చెట్లను విచక్షణారహితంగా కోల్పోతే, ఆ అభివృద్ధి ప్రయోజనం ఎంతకాలం నిలుస్తుంది అన్నది ఆలోచించాల్సిన ప్రశ్న.

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని బొల్లారంలో ఎస్‌సీబీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం 400కు పైగా చెట్లను తొలగించినట్లు వెలువడిన వార్తలు ఈ ఆందోళనను మరోసారి ముందుకు తెచ్చాయి. జిమ్‌ఖానా గ్రౌండ్స్ నుంచి శామీర్‌పేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపడుతున్న ఈ ప్రాజెక్టు రవాణా పరంగా కీలకమైనదే. కానీ దాని కోసం కోల్పోతున్న పచ్చదనం కూడా అంతే కీలకం.

ఒక చెట్టు అంటే కేవలం ఒక కాండం, కొన్ని కొమ్మలు, ఆకులు కాదు. అది ఎన్నో సంవత్సరాల సహజ సంపద. ఎండలో నీడనిస్తుంది. గాలిలోని కాలుష్యాన్ని కొంతమేర తగ్గిస్తుంది. నేలలో తేమను నిలబెడుతుంది. పక్షులకు, చిన్న జీవులకు ఆవాసమవుతుంది. ముఖ్యంగా కాంక్రీట్ నిర్మాణాలతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నగరాల్లో చెట్లు సహజమైన శీతలీకరణ వ్యవస్థగా పనిచేస్తాయి. అలాంటి చెట్టును నరికివేసి, దాని స్థానంలో కొన్ని చిన్న మొక్కలు నాటామని చెప్పడం పర్యావరణ నష్టాన్ని పూర్తిగా భర్తీ చేసినట్లుకాదు.

అభివృద్ధిని ఎవరూ ఆపాలని కోరుకోవడం లేదు. హైదరాబాద్‌కు మెరుగైన రవాణా వ్యవస్థ తప్పనిసరి. ప్రశ్న అభివృద్ధి కావాలా వద్దా అనేది కాదు. అభివృద్ధి కోసం పర్యావరణాన్ని ఎంతవరకు త్యాగం చేయాలి? అన్నదే అసలు ప్రశ్న.

ఒక ప్రాజెక్టు రూపకల్పనలో కొద్దిపాటి మార్పుతో వందలాది చెట్లను కాపాడే అవకాశం ఉంటే, ఆ మార్గాన్ని ముందుగా ఎందుకు అన్వేషించకూడదు? ప్రత్యామ్నాయ మార్గాలు, అలైన్‌మెంట్లు, నిర్మాణ సాంకేతికతలు, సాధ్యమైన చోట చెట్ల తరలింపు వంటి అంశాలను ప్రాజెక్టు రూపకల్పనలోనే పరిగణనలోకి తీసుకోవాలి. చెట్లను ముందుగా నరికేసి, ఆ తర్వాత మొక్కలు నాటడం కంటే చెట్లను కాపాడుతూ నిర్మాణం చేపట్టడం మరింత బాధ్యతాయుతమైన విధానం.

అధికారులు తొలగించిన చెట్లకు బదులుగా ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటుతామని చెప్పడం స్వాగతించాల్సిన చర్యే. కానీ మొక్కలు నాటడమే లక్ష్యం కాకూడదు. అవి బతికి, పెరిగి, భవిష్యత్తులో పెద్ద వృక్షాలుగా మారేలా సంరక్షించడం అసలు బాధ్యత. నాటిన మొక్కల సంఖ్యను లెక్కించడం కంటే, కొన్ని సంవత్సరాల తరువాత వాటిలో ఎన్ని చెట్లుగా నిలిచాయో లెక్కించడం ముఖ్యం.

ఇది ఒక్క బొల్లారం సమస్యగా చూడకూడదు. హైదరాబాద్‌లో ప్రతి పెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టుకు ముందు "చెట్లను ఎలా కాపాడాలి?" అనే ప్రశ్న తప్పనిసరిగా రావాలి. చెట్ల తొలగింపు చివరి ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉండాలి; నిర్మాణ సౌలభ్యం కోసం తీసుకునే తొలి నిర్ణయంగా కాదు.

హైదరాబాద్ ఆధునిక నగరంగా ఎదగాలి. ప్రపంచస్థాయి రహదారులు, వేగవంతమైన రవాణా, మెరుగైన మౌలిక వసతులు నగరానికి అవసరమే. కానీ భవిష్యత్ తరాలకు నివసించడానికి అనుకూలమైన వాతావరణాన్ని మిగిల్చడం కూడా మన బాధ్యత.

రోడ్లు నగరాన్ని కలుపుతాయి. చెట్లు నగరాన్ని నిలబెడతాయి. కాబట్టి అభివృద్ధి, పర్యావరణం పరస్పర విరుద్ధాలు కావు. సరైన ప్రణాళిక ఉంటే రెండూ కలిసి సాగవచ్చు. హైదరాబాద్‌కు ఇప్పుడు కావలసింది మరింత కాంక్రీట్ కాదు---పచ్చదనాన్ని కాపాడుకుంటూ సాగే బాధ్యతాయుతమైన అభివృద్ధి. అదే నిజమైన విశ్వనగరానికి గుర్తింపు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

## ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డులు--2026 ప్రదానం

హైద్రాబాద్ ఆగస్ట్ 29: జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు -- ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డులు--2026 ప్రదానం చేశారు.

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, దిగ్గజ ఒలింపిక్ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని స్మరించుకుంటూ, తెలంగాణ మేధావుల ఫోరం (తెలంగాణ మేధావుల ఫోరం), రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ప్రెస్ క్లబ్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.




ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిస్తారెడ్డి హాజరైనారు.

ఈ సందర్భంగా బాలకిస్టారెడ్డి మాట్లాడుతూ యువ క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు.

క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తాయని ఆయన తెలిపారు.

క్రీడలు ఆడటం వల్ల వ్యక్తులు మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యంగా, సంతోషంగా ఉండటానికి వీలవుతుందని మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ అన్నారు.

ఈ సందర్భంగా, ప్రొఫెసర్ బి. సురేష్ కుమార్, డా. కె. అనిత, డా. సి. సందీప్ రెడ్డి, డా. బట్టు వెంకన్న, డా. బి.ఆర్.లకు మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డులు--2026 ప్రదానం చేశారు. నేత, డా. పుంజాల సుప్రియ, డా. ఎ. సిద్ధార్థ, డా. ఆర్. మురళి, మేజర్ డి. జయసుధ, మేజర్ కె.ఎ. శివప్రసాద్ మరియు పోటెల్ శ్రీనివాస్ యాదవ్ తదితరాలకు అవార్డులు అందజేశారు..

తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, జంట నగరాల శ్రీ గుజరాతీ బ్రహ్మ సమాజ్ అధ్యక్షుడు తరుణ్ కుమార్ మెహతా, తెలంగాణ మేధావుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజ్ నారాయణ్ ముదిరాజ్, కార్యదర్శి డా. మహమ్మద్ అక్తర్ అలీ, ముఖ్య సమన్వయకర్త డా. రవితేజ, మరియు సంస్థాగత సమన్వయకర్తలు శ్జి. వేణుగోపాల్, కె. రవీందర్, సూర్య మరియు పలువురు ఇతరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించారు.

# శివ యోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ప్రాంగణంలో సెప్టెంబర్ 20 నవిశేష పూజా కార్యక్రమాలు



హైద్రాబాద్ ఆగస్ట్ 29: మల్కాజ్గిరి ఆనంద్ బాగ్ లో గల శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో బాసర క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయ సమీపంలో గల శివ యోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ ప్రాంగణంలో గల కోటి పార్థివలింగ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిర మాసోత్సవము సెప్టెంబర్ 20 న ఉచితముగా ఎలాంటి రుసుము లేకుండా విశేష పూజా కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఆసక్తిగల భరతనాట్యం ,కూచిపూడి నాట్య గురువులు తమ పిల్లల చేత ప్రదర్శన చేయించదలచినచో ఈనెల 31 లోపు 9948332032 ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబికానాధ శర్మ ను సంప్రదించి తమ నాట్యాలయం , సంస్థ పేరు నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు

# బిసి సంక్షేమ సంఘం గ్రేటర్ హైద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా బి.నరేష్



హైద్రాబాద్ ఆగస్ట్ 29;బిసి సంక్షేమ సంఘం గ్రేటర్ హైద్రాబాద్ ప్రధాన కార్యదర్శిగా బి.నరేష్ నియమితులైనారు.ఈ మేరకు శనివారం బిసి భవన్ లో జరిగిన సమావేశం లో జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్య సభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ రాష్ట్రం లోబిసి లకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తానని అన్నారు.ముక్యంగా విద్యార్థులకు స్కాలర్ షిప్స్,ఫీజు రీయంబర్స్ మెంట్ విషయం లో ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని నరేష్ తీవ్రంగా ఖండించారు.టీచర్స్ పోస్టులు భర్తీ చేయక పోవడం మూలంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని,వెంటనే ఖాళీగా ఉన్న 34 వేళ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాం చేశారు. తనపై గల నమ్మకం తో తనకు ఈ పదవి ని ఇచ్చిన ఆర్.కృష్ణయ్య కు అందుకు సహకరించిన బుపేష్ సాగర్,నీలా వెంకటేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## తెలంగాణలో బీసీల ఐక్యత చాటాలి

## గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి.



హైదరాబాద్ ఆగస్ట్ 29 ; తెలంగాణ బిసి సెల్ సంగాల సమావేశం గాంధీభవన్ లో జరిగినది.ప్రభుత్వ బిసి సలహా దారుడు విహెచ్ హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి మాట్లాడుతూ మాట్లాడుతూ బీసీల కుల గణన జన గణనల ను కేంద్ర ప్రభుత్వం పక్కనపెట్టి బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు వెంటనే కులగలనా బీసీ కులాలకు 42% రిజర్వేషన్ తో పాటు ఓటర్ నమోదు కార్యక్రమాల్లో 62% ఓట్లు ఉన్న బీసీలను తొలగిస్తున్నారని నరేంద్ర మోడీ ఒక బీసీ అయి ఉండి బీసీల ఓట్లను తొలగించడం సరికాదని అన్నారు వెంటనే తెలంగాణలో 10 ఉమ్మడి జిల్లాల్లో తిరిగి బీసీ కులాల సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ప్రారంభించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొపెసర్ కంచె ఐలయ్య ఈబీసీ సెల్ అధ్యక్షులు వి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# కాప్రా చెరువులో గణేష్ నిమజ్జనాలకు వెసులుబాటు లేదు

**చిన్న విగ్రహాల నిమజ్జనానికి బేబీ పాండ్‌ను వాడుకుందాం**

**అర్బన్ వెట్‌ల్యాండ్ జాబితాలో కాప్రాచెరువుందన్న హైడ్రా కమిషనర్**

**జీవవైవిద్యం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత మనదే అంటూ హితవు**

హైదరాబాద్, ఆగస్టు 29 జీవ వైవిద్యానికి ప్రతీకగా చరిత్రకెక్కిన కాప్రా చెరువు.. సాధారణ నీటి వనరు మాత్రమే కాదు.. నగర పర్యావరణ సమతుల్యతకు కీలకమైన వెట్‌ల్యాండ్ అని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో కాప్రా చెరువులో గణేష్ నిమజ్జనం సరికాదన్నారు. చెరువు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు కాప్రా చెరువుకు వచ్చిన హైడ్రా కమిషనర్ ఇదే విషయాన్ని భాగ్యనగర్ ఉత్సవ కమిటీ స్థానిక ప్రతినిధులకు వివరించారు. చిన్న విగ్రహాలు నిమజ్జనానికి చెరువు చెంత ఉన్న బేబీ పాండ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. అర్బన్ వెట్‌ల్యాండ్స్‌లో భాగంగా ఉన్న ఈ చెరువు లక్ష్యాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కాప్రా చెరువులో 70 శాతం వరకూ ప్రైవేట్ పట్టా భూములున్నా.. వారంతా ముందుకు వచ్చి చెరువు అభివృద్ధికి సహకరించారన్నారు. కాప్రా లేక్ రివైవల్ గ్రూప్ ప్రతినిధులు కూడా హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారిని కలిసారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. చెరువుకు వచ్చే వలస పక్షుల చిత్రాలతో కూడి ఫొటో ఎగ్జిబిషన్‌ను హైడ్రా కమిషనర్ తిలకించారు. ఆస్ట్రేలియా, యూరప్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కు పైగా వలస పక్షులకు ఆవాసంగా ఈ చెరువును కేంద్రం ఇదివరకే గుర్తించిందని కమిషనర్ చెప్పారు. కేంద్రం ప్రకటించిన అర్బన్ వెట్ ల్యాండ్ జాబితాలో కాప్రా చెరువు ప్రధానంగా ఉందన్నారు. మంజీరా వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ (ఓజీనితీతితీజీ చితిశ్రీటశ్రీతిటవ రాజీనిఇబిబీజీతీఎ), పాఖల్ లేక్ వైల్డ్‌లైఫ్ సాంక్చువరీ (ఖజీనిష్ట్రజీశ్రీ ఒజీనివ చితిశ్రీటశ్రీతిటవ రాజీనిఇబిబీజీతీఎ) కూడా ఈ జాబితాలో ఉన్నాయని గుర్త చేశారు. వెట్ ల్యాండ్స్ పరిరక్షణ, నిర్వహణ రూల్స్ 2017 ప్రకారం చెరువు హద్దులు నిర్ధారించడం, ఆక్రమణలు జరగకుండా చూడడం, కాలుష్యం నుంచి కాపాడడం వంటి బాధ్యతలున్నాయన్నారు. ఈ క్రమంలోనే 113 ఎకరాల కాప్రా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోందని చెప్పారు. వరద నీటి నిల్వ, భూగర్భ జలాల పునరుద్ధరణ, జీవవైవిధ్యం, పక్షుల ఆవాసం వంటి పర్యావరణ హితమైన అంశాల ప్రాతిపదికన ఈ చెరువును అభివృద్ధి చేస్తున్నామని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కాప్రా చెరువులో గణేష్ నిమజ్జనం సరికాదని.. అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పెద్ద విగ్రహాల నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులకు సూచించారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త గారు, హైడ్రా ఏసీపీ ఉమా మహేశ్వర్ రావుతో పాటు, చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ గారు హైడ్రా కమిషనర్ పర్యటనలో ఉన్నారు.



# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 5కే పరుగు

### మేజర్ ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళులు --- పరుగు ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 29:**జాతీయ క్రీడా దినోత్సవం--2026లో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో శనివారం 5కే పరుగు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో తూముకుంటలోని రామచంద్ర మినీ స్టేడియం నుంచి ఉదయం 6 గంటలకు 5కే పరుగు ప్రారంభమైంది.




ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 5కే పరుగును జెండా ఊపి ప్రారంభించారు.

క్రీడల ప్రాధాన్యతను ప్రజల్లో మరింతగా పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి పి. దామోదర్ రెడ్డి, ఫిట్‌నెస్ కోచ్ పవన్ కుమార్, టీఎస్ పోలీస్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ చైర్మన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 100 మంది క్రీడాకారులు, క్రీడాభిమానులు 5కే పరుగులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పుట్టినరోజు శుభాకాంక్షలు బావగారు





**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** పుట్టినరోజు శుభాకాంక్షలు బావగారు అంటున్న వెల్నెస్ ట్రీ హాస్పిటల్ సూపర్వైజర్ అరవింద్ తెలిపారుమా బావగారు విధి నిర్వహణలో బాధ్యతగా తన వంతు ప్రజలకు కృషి పాయసంకారాలు ఎల్లవేళలా ప్రజలకు అందించే గొప్ప మంచి మనసున్న పోలీస్ మా బావగారు అని అరవింద్ తెలిపారు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని దేవుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ప్రజల మధ్యలో ఉంటూప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వ ఆదేశాల మేరకుప్రజలకు మంచి సేవ లు అందించి ఉన్నతమైన గౌరవమైన స్థాయికి ఎదగాలని మరొకసారి మా బావ విధి నిర్వహణలో జీన్స్ అని చెప్పుకోవచ్చని అరవింద్ తెలిపారు

# ఎలివేటెడ్ కారిడార్ భూయజమానులకు రూ.96.5 కోట్ల పరిహారం

### 63 మంది భూయజమానులకు రెండో విడత చెక్కులు అందజేసిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఆగస్టు 29:** సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన అల్వాల్ మండల భూయజమానులకు రెండవ విడత లో చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి. శనివారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి 7,222 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చిన 63 మంది అల్వాల్ మండల భూయజమానులకు డిఆర్ఓ మాలతితో కలిసి జిల్లా కలెక్టర్ 96.5 కోట్ల రూపాయల పరిహార నిధుల చెక్కులు అందజేసారు.

# జీవో 97 రద్దు చేయాలి ఎమ్మెల్యే కడియం శ్రీహరి



హైదరాబాద్ జీవో 97 ను రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేసారు. మాజీ విద్యాశాఖ మంత్రిగా జీవో 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్కు ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్తో కలిపే ఉంచాలని డిమాండ్ చేస్తున్నాను. ఈ జీవోతో విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నందున, పాలిటెక్నిక్ విద్యార్థులను టెక్నికల్ ఎడ్యుకేషన్లోనే కొనసాగించాలి. అలా చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది ఉండదనే భరోసాను ప్రభుత్వం ఇచ్చినట్లు అవుతుందని అయన అన్నారు.

# ఫీజు బకాయి బిజెపి లడాయి

- . విద్యార్థులకు ఒకే విడతలో ఫీజు రియంబర్స్మెంట్ ను చెల్లించాలి
- బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్
- . కొత్తగూడెం బస్టాండ్ అమర వీరుల స్తూపం వద్ద యువ మోర్చా అధ్యక్షులు జజ్జూరు మోహన కృష ఆధ్వర్యంలో నిరసన దీక్ష

**చంద్రుగొండ /కొత్తగూడెం ప్రజబలం ప్రతినిధి** :- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పిలుపుమేరకు విద్యార్థి, విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి కోరుతూ నిరసన దీక్షను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ





నాడు బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ వాగ్దానాలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొత్తగూడెం అమరవీరుల స్తూపం మరియు బస్టాండ్ సెంటర్ వద్ద భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన గుప్పిట్లో పెట్టుకుని విద్యార్థుల భావిభారత భవిషత్ ను నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల సుమారు 40 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా ప్రభుత్వం చెల్లించాల్సిన దాదాపు రూ.15,000 కోట్ల ఫీజు బకాయిలు నిలిచిపోవడంతో కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక, సరి అయిన సమయంలో సర్టిఫికెట్లు పొందలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ.15,000 కోట్ల బకాయిలను ఒకే విడతలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా, జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉగ్రరూపంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శిలు, డాక్టర్ జాటోత్ వెంకన్న, బిక్షపతి, బోగి కృష్ణ, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, కిసాన్ మోర్చా అధ్యక్షులు గొట్టిపుల్ల దుర్గా శ్రీనివాసరావు, మహబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముసుకు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు భూక్య శ్రీను, మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, గిరిజన మోర్చా అధ్యక్షురాలు భూక్యా స్వాతి, ఓబీసీ మధ్య అధ్యక్షులు జటంగి కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చాపలమడుగు రాకేష్ కుమార్ బాబు, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ బిమల్ కుమార్ జైన్, జిల్లా కార్యదర్శిలు రఘురాం, దురుశెట్టి కుమార్, మీడియా కన్వీనర్ కోలికపోగు రామారావు,మండల అధ్యక్షులు బలగం శ్రీధర్, పల్లపు వెంకటేశ్వర్లు, ముత్యాల శ్రీనివాసరావు, బిక్షపతి, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి కోలా హరీష్, నాయిని శ్రీనివాస్, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి సలీం, గుమలాపురపు సత్యనారాయణ, మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్‌కు జాతీయ స్థాయి కవితా పురస్కారం




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 ఏటూరు నాగారం ఏటూరునాగారం, ఆగస్టు 29 మనం న్యూస్:**ఏటూరునాగారం జేఆర్ హైస్కూల్ ప్రిన్సిపాల్ అన్నీ మేరీ మాథ్యూ సాహిత్య రంగంలో తన ప్రతిభను చాటుకుంటూ జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆమె రచించిన ‘ హోప్ కవితకు నిర్వహించిన జాతీయ కవితా పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది.

సాహిత్య అకాడమీ పేరుతో జారీ చేసిన ప్రశంసాపత్రం ప్రకారం, 2026 ఏప్రిల్ 7న ఈ పురస్కారం అందించినట్లు పేర్కొంది. ప్రముఖ సాహిత్యవేత్తలతో కూడిన న్యాయనిర్ణేతల బృందం ఆమె కవితను ఎంపిక చేసినట్లు సర్టిఫికెట్‌లో ఉంది.

విద్యా రంగంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే సాహిత్యంపై తనకున్న ఆసక్తిని కొనసాగిస్తూ ‘హోప్’ కవితతో జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి సాధించడం విశేషంగా నిలిచింది. ఆమె సాధించిన ఈ ఘనతతో ఏటూరునాగారం జేఆర్ హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది.

అన్నీ మేరీ మాథ్యూ సాధించిన ఈ విజయంపై జేఆర్ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సాహిత్యాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సృజనాత్మకత, సాహిత్యంపై ఆసక్తిని పెంపొందించడంలో ఆమె విజయం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఏటూరునాగారం ప్రాంతం నుంచి జాతీయ స్థాయి కవితా పోటీలో ప్రథమ బహుమతి సాధించడం పట్ల స్థానికులు సైతం గర్వం వ్యక్తం చేస్తున్నారు.

# గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

**షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు**

**సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు.. పీపీపీ విధానంలో అభివృద్ధి**

**పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం: మంత్రి జూపల్లి**







**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్, ఆగస్టు 29: తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఇందులో భాగంగా షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు.

సోమశిలలో మరో ప్రపంచస్థాయి కోర్సు

కృష్ణానది తీరంలో, నల్లమల అడవులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పర్యాటక క్లస్టర్ సోమశిలలో మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సోమశిలను ప్రత్యేక గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేయడంతో తెలంగాణను గోల్ఫ్ టూరిజం హబ్‌గా మరింత బలోపేతం చేయవచ్చన్నారు. గోల్ఫ్ టూరిజం మౌలిక వసతుల అభివృద్ధిలో పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానాన్ని అనుసరించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ సందర్భంగా శనివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. డీపీ వరల్డ్ ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (డీపీ వరల్డ్ పీజీటీఐ), హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీకి ఈవెంట్ పార్ట్‌నర్‌గా తెలంగాణ టూరిజం వ్యవహరిస్తోంది.

తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ కేవలం క్రీడా పోటీ మాత్రమే కాదని.. అంతర్జాతీయ గోల్ఫ్‌ను తెలంగాణ పర్యాటక, వారసత్వ సంపదతో అనుసంధానించే వేదిక అని జూపల్లి అన్నారు. గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ కోర్సులో ఈ టోర్నీ నిర్వహించడం రాష్ట్ర చరిత్ర, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కిందన్నారు. హైదరాబాద్ నగరానికే తెలంగాణ పర్యాటకం పరిమితం కాదని.. రాష్ట్రంలోని సరస్సులు, అడవులు, గోదావరి, కృష్ణా నదులు, రాజభవనాలు, కోటలు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.

కపిల్‌దేవ్ సేవలు వినియోగించుకుంటాం

తెలంగాణలో పర్యాటకం, క్రీడల ప్రచారం కోసం కపిల్‌దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని జూపల్లి తెలిపారు. ఆయన అనుభవం, అంతర్జాతీయ గుర్తింపును రాష్ట్ర పర్యాటక, క్రీడా రంగాల ప్రచారానికి ఉపయోగించుకుంటామని చెప్పారు. టోర్నీ నిర్వహణకు సహకరిస్తున్న డీపీ వరల్డ్ పీజీటీఐ, హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్, ఇతర భాగస్వాములకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణను ప్రపంచస్థాయి గోల్ఫ్ టూరిజం గమ్యస్థానంగా అభివృద్ధి చేసేందుకు ప్రపంచస్థాయి సౌకర్యాల కల్పన కొనసాగిస్తామని చెప్పారు.

తెలంగాణ టూరిజం సహకారం అభినందనీయం

డీపీ వరల్డ్ పీజీటీఐ అధ్యక్షుడు కపిల్‌దేవ్ తెలంగాణ టూరిజం అందిస్తున్న సహకారాన్ని అభినందించారు. ఈ టోర్నీ ద్వారా తెలంగాణ, హైదరాబాద్‌ను ప్రముఖ గోల్ఫ్ టూరిజం గమ్యస్థానాలుగా ప్రచారం చేయవచ్చన్నారు. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ అందిస్తున్న వేదికకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచానికి హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ పరిచయం

హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కెప్టెన్ జస్విందర్ సింగ్ బిర్గి మాట్లాడుతూ.. 12వ తెలంగాణ గోల్కొండ మాస్టర్స్‌కు ఆతిథ్యమివ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ గోల్ఫర్ల ఆటను హెచ్‌జీఏ సభ్యులు వీక్షించే అవకాశం లభిస్తుందని తెలిపారు. లైవ్ టెలికాస్ట్ ద్వారా హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అవుతుందన్నారు.

132 మంది గోల్ఫర్లు.. రూ.కోటి ప్రైజ్‌మనీ

సెప్టెంబరు 1 నుంచి 4 వరకు జరిగే టోర్నీలో 132 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొననున్నారు. రూ.కోటి ప్రైజ్‌మనీ కోసం పోటీపడనున్నారు. భారత్‌తో పాటు విదేశాలకు చెందిన ప్రముఖ గోల్ఫర్లు పాల్గొంటున్నారు. టోర్నీకి అధికారిక ప్రపంచ గోల్ఫ్ ర్యాంకింగ్ (ాఔ+=) పాయింట్లు లభించనున్నాయి.

కార్యక్రమంలో డీపీ వరల్డ్ పీజీటీఐ సీఈఓ అమన్‌దీప్ జోల్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన అంతర్జాతీయ గోల్ఫర్ స్టెపాన్ డానెక్ తదితరులు పాల్గొన్నారు.

## ఐటిడిఏ జిల్లా స్థాయి క్రీడా పోటీలో పాల్గొన్న ఉపాధ్యాయ క్రీడాకారులు.



**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 29 ప్రజాబలం:** ఐటిడిఏ భద్రాచలంలో జరిగినటువంటి ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి గిరిజన ఉద్యోగులు ఉపాధ్యాయులు ఖమ్మం జిల్లా నుండి 29,30 తారీఖులో జరుగుతున్నాయి. వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాట్మెంటను ఉమెన్ చెస్, క్యారమ్స్, టెన్నికాయిడ్ పోటీలలో ఖమ్మం జిల్లా క్రీడాకారులు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా క్రీడాకారులతో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ గ్రూప్ ఫోటో దిగి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొన్న ఉపాధ్యాయులను, ఉద్యోగులను అభినందించారు. ఉపాధ్యాయులు క్రీడా స్ఫూర్తితో ఈ రెండు రోజులు చక్కగా పాల్గొ నాలన్నారు. ఈ పోటీలు పాల్వంచ కిన్నెరసాని స్పోర్ట్స్ క్రీడా మైదానంలో జరిగాయి. ఈ పోటీలో ఖమ్మం జిల్లా నుండి ఏసీఎంఓ ఎల్.రాములు, పీడీలు ఎన్.శంకర్రావు, బి.సక్రాం, జె.రామారావు, సుస్మిత, సతీష్, క్రీడాకారుల డిఎస్. నాగేశ్వరరావు, బి. రాందాస్, రమేష్, నామాల శ్రీనివాస్, జె. శ్రీనివాస్, జి.భారతి, అశ్విని, ఎం శివ, ఏ.సేన, జి.నాగేశ్వరరావు మోహన్, కిషన్, కృష్ణ, వీరన్న, జె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయం సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 వెంకటాపురం** ములుగు జిల్లా మండల కేంద్రంలోని పాలంపేట గ్రామంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించిన సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ మరియు వారి సతీమణి. డిఆర్ఎం సికింద్రాబాద్ డాక్టర్ గోపాల కృష్ణన్ గారు ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్ లు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఆలయ మండపంలో ఈవో ఉమ్మడి భాస్కర్ శాలువాతో సత్కరించారు అనంతరం ఆలయ చరిత్ర శిల్పకళా వైభవాన్ని టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ వివరించారు వారి వెంట టూరిస్ట్ పోలీసులు శ్రీకాంత్ బద్రు పురావస్తు దేవాదాయ శాఖ వారు ఉన్నారు

## కేశవరెడ్డికి నివాళులర్పించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు నాయకులు.




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం ఆగస్టు 29:** తల్లాడ మాజీ సొసైటీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి సోదరుడు దుండేటి కేశవరెడ్డి అనారోగ్యంతో శనివారం ఉదయం 7.0 గంటలకు మృతి చెందారు. విషయం తెలుసుకొన్న తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు పార్టీ నాయకులు గొల్లగూడెంలో ఆయన గృహానికి చేరుకొని కేశవరెడ్డి భౌతిక ఖాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన రెడ్డి, ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దుగ్గిదేవర వెంకట్ లాల్, అన్నారుగూడెం ఉప సర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు, సిపిఎం పార్టీ సీనియర్ మండల నాయకులు పులి వెంకట నరసయ్య, బిఆర్ఎస్ పార్టీ తల్లాడ టౌన్ అధ్యక్షులు జివిఆర్, ఆ యూత్ నాయకులు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్‌లో వేతన ఒప్పందం



**జహీరాబాద్, ఆగస్టు 29 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్‌లోని మహీంద్రా ట్రాక్టర్ ప్లాంట్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో చారిత్రాత్మక వేతన ఒప్పందం కుదిరిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు చుక్క రాములు తెలిపారు. ఒప్పందం సందర్భంగా శుక్రవారం కార్మికుల గేట్ మీటింగ్ నిర్వహించారు. ప్రస్తుత వేతనం రూ.14,761 నుంచి రూ.15,761కు పెంచినట్లు చెప్పారు. వీఏడీఏ రూ.3 నుంచి రూ.3.55కు పెంపు, మెడికల్ అలవెన్స్ రూ.2,100, షిఫ్ట్ అలవెన్స్ రూ.35కు పెంపు, దసరా ఆయుధ పూజ సెలవును హాఫ్‌డే నుంచి ఫుల్‌డేగా మార్చడం వంటి ప్రయోజనాలు కల్పించినట్లు వివరించారు. లాంగ్ సర్వీస్ అవార్డులు, హజార్డస్ అలవెన్స్, ఉచిత బస్సు, ప్రమోషన్ పాలసీలో మార్పులు, సీఎల్ 8 నుంచి 9 రోజులకు పెంపు, జీపీఏ రూ.8 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంపు తదితర సౌకర్యాలు సాధించినట్లు తెలిపారు. కార్మికుల ఐక్యతతోనే విజయాలు సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం, ఎస్.మహిపాల్, గణేష్, వంశీ, మహేశ్వర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బద్వేల్ ఆర్టీసీ బస్సులో లక్ష పదివేల రూపాయల చోరీ

కడప అట్లూరు మండలం ఆకుతోటపల్లె గ్రామానికి చెందిన అరవ శారదమ్మ అట్లూరు క్రాస్ రోడ్డు లో బద్వేల్ ఆర్టీసీ బస్సులో బస్టాండ్ కు చేరుకునే లోపే డబ్బు మాయం అయింది. బద్వేలు లో బ్యాంకు లో ఉన్న బంగారం విడిపించేందుకు తన బ్యాగులో మూడు లక్షల రూపాయలతో శారదమ్మబయలుదేరింది. తన భర్తతో కలిసి బద్వేల్ అర్బన్ పోలీసులు ఆశ్రయించింది.

### రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ
### ఇబ్రహీంపట్నం హుండీని అపహరించిన గుర్తుతెలియని దుండగులు

హైదరాబాద్ కమిషనరేట్ ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధి రావిర్యాల గ్రామంలోని ప్రముఖ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో దొంగతనానికి పాల్పడ్డ అపరిచిత వ్యక్తి. హుండీ ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డురంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాలలోని ప్రసిద్ధ చెందిన సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లాడు. స్థానికులు, ఆలయ వర్గాల కథనం ప్రకారం.. దొంగ బైక్ పై ఆలయానికి వచ్చి, ఎవరూ లేని సమయం చూసి దర్జాగా హుండీని ఎత్తుకెళ్లాడు. ఉదయం ఆలయానికి వచ్చిన పూజారికి హుండీ కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఆలయ కమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలోని సీసీ కెమెరాల ఫుటేజీని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయంలో దొంగతనం జరగడం అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇకనుంచి ఆలయానికి గట్టి భద్రత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రణాళికాబద్ధమైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలి

### సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 ములుగు**శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఈ సందర్భంగా పాఠశాల, కళాశాలలోని నిఘా కెమెరాల పనితీరు, విద్యార్థినులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్న అనంతరం తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించారు. జూనియర్ కళాశాల విద్యార్థినులకు నిర్వహిస్తున్న యూనిట్ పరీక్షల తీరును పరిశీలించి, పరీక్షల నిర్వహణపై సంబంధిత ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

విద్యార్థినులకు నిర్ణీత ఆహార పట్టిక ప్రకారం నాణ్యమైన, పౌష్టికమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శనివారం ఆహార పట్టిక ప్రకారం అందించాల్సిన భోజన పదార్థాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భోజనం తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

విద్యార్థినులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యాభ్యాసం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వాతి, రికార్డు అసిస్టెంట్ రాజు, సంబంధిత అధికారులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.

## :: అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 కలెక్టరేట్**శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి అధ్యక్షతన నూతన కలెక్టరేట్ తన ఛాంబర్ లో రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై మల్లంపల్లి, పందికుంట, యువజన శిక్షణ కేంద్రం, జాకారం, నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వేగ నియంత్రణ పట్టీలు, సూచిక బోర్డులు,రేడియం స్టికర్లు, ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జాతీయ రహదారికి అనుసంధానమయ్యే రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆయా అనుసంధాన ప్రాంతాల వద్ద వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా సూచిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఆర్ టి ఓ ఈశ్వర్ సింగ్ ఠాగూర్, నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, పి ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, ఎక్సైజ్ సి ఐ సుధీర్ కుమార్, మునిసిపల్ కమిషనర్ సంపత్, ఆర్టి సి, పోలీస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో పోరాటం కొనసాగిస్తాం

### అందోల్ డివిజన్ కార్యదర్శి డి విద్యాసాగర్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 29 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** విద్యుత్ ప్రజలకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, బషీర్బాగ్ విద్యుత్ అమరవీరులు, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ, త్యాగాల స్ఫూర్తితో, విద్యుత్ కాపాడుకోవడానికి ప్రజా పోరాటాలు, కొనసాగిస్తామని సంగారెడ్డి జిల్లా జోగిపేటలో, సిపిఎం ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి,విద్యాసాగర్, ఉన్నారు, ఈ సందర్భంగా జోగిపేటలో ఘన నివాళులు అర్పించారు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2000 సంవత్సరంలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యుత్ ప్రైవేట్ కరణ ఆపాలని, రైతన్నకు ఉచిత కరెంట్ ఇవ్వాలని, అప్పటి ప్రభుత్వం పై పోరాటం చేసే క్రమంలో, పోలీసుల కాల్పులకు వీరమరణం పొందిన, అమరవీరుల స్ఫూర్తిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని, నాటి పోరాట ఫలితమే నేటి ఉచిత విద్యుత్ అని అన్నారు, విద్యుత్తు ప్రజల హక్కు, ఇది కార్పొరేట్ కు అనుకూలంగా మార్చకూడదని, వీరి స్ఫూర్తిగా ప్రజాహక్కులను కాలరాసె కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, గుణపాఠం చెప్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో వట్టిపల్లి మండల నాయకులు మహేష్, మురళి, శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు...

### గిరిజన యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం

పోలవరం జిల్లాలోని పౌరసరఫరాల శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఖాళీగా ఉన్న ఐదు పోస్టుల భర్తీకి అర్హత కలిగిన గిరిజన యువతీ యువకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇందులో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులు మూడు ఉండగా డిగ్రీతో పాటు ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞాన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు రెండు ఉండగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అభ్యర్థులు స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని పరిపాలన అధికారికి దరఖాస్తులను నేరుగా సమర్పించాలి. విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు, ఫొటోలు తదితర అవసరమైన పత్రాలను దరఖాస్తుతో పాటు సమర్పించాలి.

# గీత కార్మికుల సంక్షేమానికి చేయూత -- వన మహోత్సవంలో ఈత మొక్కలు నాటిన సర్పంచ్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 ఏటూరు నాగారం** ఏటూరు నాగారం మండల కేంద్రంలో కార్మికుల ఆర్థికాభివృద్ధి మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వారికి చేయూత అందించే లక్ష్యంతో అటవీ శాఖ (ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్) మరియు డిఆర్డిఎ ఆధ్వర్యంలో ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు హాజరై, అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు

ఈ సందర్భంగా ముఖ్య అతిథులు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ... గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఈత, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు.

ఈ మొక్కలు భవిష్యత్తులో పెరిగి గీత కార్మికులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, పర్యావరణ పరిరక్షణతో పాటు గీత కార్మికుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఆశించారు.బి

ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు ఫారెస్ట్ అధికారి భాస్కర్, ఎండి వలీ బాబా, చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్ సప్పిడి రాంనర్సయ్య,తురం పద్మ, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కార్యదర్శి జనార్ధన్, కన్నబోయిన రాజు యాదవ్, గౌడ సంఘం నాయకులు సప్పిడి రామ్ కొండల్, రఘు, మొగిలి, పాలకుర్తి విజయ్, తాళ్ల పెల్లి మోహన్, మెరుపు వెంకటేశ్వర్లు, సది, కొండాయి చిన్ని, అటవీ శాఖ అధికారులు, గౌడ సంఘ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.బి

# ఏటూరు నాగారం లో ఘనంగా బి.ఆర్.ఎస్. పార్టీ సన్నాహక సమావేశం -- అమరులకు నివాళులు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29 ఏటూరు నాగారం** ములుగు నియోజకవర్గం జిల్లా బి.ఆర్.ఎస్. పార్టీ ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు



కార్యక్రమంలో భాగంగా బి.ఆర్.ఎస్. పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు శ్రీ కాకులమర్రి లక్ష్మణ్ బాబు హాజరై, ముఖ్య నాయకులతో కలిసి దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, అశ్రునివాళు లు అర్పించారు

అనంతరం నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, రాబోయే కార్యక్రమాలకు కార్యకర్తలంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు మరియు బి.ఆర్.ఎస్. పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# 25వ వార్డులో సీసీ మురికి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



**జహీరాబాద్, ఆగస్టు 29 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు డ్రైవర్ కాలనీలో సీసీ మురికి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ జి.ప్రభాకర్‌తో కలిసి పనులను ప్రారంభించారు. కాలువ నిర్మాణంతో మురుగునీరు నిల్వ ఉండకుండా, వర్షాకాలంలో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తగ్గనున్నాయని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనమైన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మురికి కాలువలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి వార్డును సమానంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ జాకీర్, కాంగ్రెస్ నాయకులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఖాజా, కాంగ్రెస్ నాయకులు ముస్తఫా, ఇసమోద్దీన్, సలీం, మున్సిపల్ సిబ్బంది ఇస్మాయిల్, ఖదీర్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రొద్దుటూరు పోలీసుల మెగా రక్తదాన శిబిరం

భారతదేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జన్మదినం సందర్భంగా గౌరవ కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథన్ ఉత్తరాలు మేరకు ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ అయిన విభు కృష్ణ ప్రొద్దుటూరు పట్టణంలో గల రోటరీ క్లబ్ వారు సౌజన్యంతో పోలీస్ మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ గారు స్వయంగా రక్తదానం చేయడం జరిగింది. అలాగే ఒకటవ పట్టణ సీఐ కొండారెడ్డి, ట్రాఫిక్ సిఐ భాస్కర్, వన్ టౌన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి,టూ టౌన్ ఎస్ఐ రాఘవేంద్ర రెడ్డి,రాజుపాలెం ఎస్సై ప్రణయ్ కుమార్ రెడ్డి మరియు 27 మంది పొద్దుటూరు సబ్ డివిజన్ సిబ్బంది రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాఖ గారు మాట్లాడుతూ భారతదేశంలో చాలామంది రోగులు ముఖ్యంగా తల సేమియా వ్యాధిగ్రస్తులు తగిన రక్తం అందక ఇబ్బందులు పడుతున్నారని, రక్తదానం చేయడం వలన అనేక ఉపయోగాలు ఉన్నాయని చాలామంది రకరకాల సమస్యలతో ఇబ్బంది పడే వారి పట్ల రక్తదానం అనేది చాలా ఉపయోగకరమని చెప్పడమైనది. అలాగే ప్రొద్దుటూరు ప్రజలను రక్తదానం చేసి రోగులకు బాసట గా నిలబడాలని ఆకాంక్షించడమైనది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినటువంటి రోటరీ క్లబ్ సభ్యులకు, ప్రభుత్వ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బందికి, ఈ కార్యక్రమాన్ని కవర్ చేసినటువంటి మీడియా సిబ్బందికి యాఖ విభుకృష్ణ గారు ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది.

# ఎస్సీ, ఎస్టీ బాధితులకు 2 బిహెచ్‌కే ఇళ్లు

## తొలిసారిగా మేడ్చల్--మల్కాజిగిరిలో ప్రత్యేక చర్యలు: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్క వెంకటేశం

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 29:**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు 2 బిహెచ్‌కే ఇళ్లను కేటాయించడం ద్వారా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్క వెంకటేశం అన్నారు. బాధిత కుటుంబాలకు ఇళ్లతో పాటు ఉపాధి, పెన్షన్ వంటి సంక్షేమ ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.




శనివారం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ, మాన్యువల్ స్కావెంజర్ల కమిటీ సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ల వారీగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు.

అట్రాసిటీ కేసులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదైన వెంటనే విచారణ దశలో ఉన్న బాధితులకు నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని బక్క వెంకటేశం సూచించారు. భౌతిక దాడులు, గంజాయి తదితర మాదకద్రవ్యాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్లిష్టమైన సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించేందుకు సహకరిస్తామని తెలిపారు.

జిల్లాలో అవసరమైన అదనపు న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వంతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి పెండింగ్ కేసులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సఫాయి కర్మచారులకు ఆరోగ్య శిబిరాలు

సఫాయి కర్మచారుల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సూచించారు. వారికి క్రమం తప్పకుండా వ్యక్తిగత రక్షణ పరికరాలు, భద్రతా కిట్లు అందించాలని, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైన్‌ప్రూఫ్ కిట్లను కూడా అందుబాటులో ఉంచాలని మున్సిపల్, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. మహిళా సఫాయి కర్మచారుల కోసం ప్రత్యేక డ్రెస్సింగ్ గదులను ఏర్పాటు చేయాలని కోరారు.

గతంలో నిర్వహించిన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాల నిర్ణయాల మేరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తదుపరి సమావేశం నాటికి అమలు చేసి, పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

బాధితులకు 2 బిహెచ్‌కే ఇళ్లతో పాటు ఉపాధి, పెన్షన్ వంటి ప్రయోజనాలు అందేలా రెవెన్యూ అధికారులు సహకరించాలని సూచించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే, డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీల సమస్యలపై అదనపు కలెక్టర్లు స్పందించి, పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీఓలు వెంకటరెడ్డి, శ్యాంప్రకాశ్, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఘనంగా లిఖితారెడ్డి హోటల్ ప్రారంభం.

**నాణ్యమైన టిఫిన్లు.రుచికరమైన నాన్‌వెజ్ వంటకాలతో ప్రత్యేక ఆకర్షణ.**
**రుచి మా ప్రతిజ్ఞ.మీ సంతృప్తే మా లక్ష్యం.**
**యాజమాన్యం లిఖితారెడ్డి వెల్లడి.**




**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం ఆగస్టు 29:**తల్లాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిఖితా రెడ్డి హోటల్,టిఫిన్స్ ఢ కర్రీ పాయింట్స్ ను ఆదివారం ఘనంగా ప్రారంభించనున్నట్లు హోటల్ యాజమాన్యం లిఖితా రెడ్డి తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో హోటల్ ను ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. హోటల్‌లో ఉదయం నుంచి రుచికరమైన ఇడ్లీ,దోశ,ఉప్మా,వడ తదితర టిఫిన్ వంటకాలతో పాటు వివిధ రకాల నాన్‌వెజ్ వంటకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.అలాగే కర్రీ పాయింట్ ద్వారా ఇంటికి తీసుకెళ్లేందుకు వివిధ రకాల కర్రీలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.నాణ్యత, రుచి,పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వంటకాలను అందించనున్నట్లు యాజమాన్యం తెలిపింది.తల్లాడ పట్టణ ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు హోటల్‌ను సందర్శించి తమ ఆదరణ అందించాలని కోరారు."రుచి మా ప్రతిజ్ఞ.మీ సంతృప్తి మా లక్ష్యం"అనే నినాదంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని లిఖితా రెడ్డి తెలిపారు.ప్రారంభోత్సవానికి ప్రజలు, శ్రేయోభిలాషులు హాజరై విజయవంతం చేయాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

# కాబోవు వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు .



**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం ఆగస్టు 29:**తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన సూదా ప్రకాశ్‌రావు–కుమారి దంపతుల కుమారుడు వరుడు చిరంజీవి గిరిధర్ వివాహం హైదరాబాద్ చింతల్‌కు చెందిన అనకమల్ల రాజేందర్–రాధిక దంపతుల కుమార్తె వధువు చిరంజీవి గీతతో ఈ నెల 30న ఘనంగా జరగనుంది.

హైదరాబాద్‌లోని శామీర్‌పేట రోడ్డులోని శుభం కన్వెన్షన్ వేదికగా ఆదివారం రాత్రి 9:49 గంటలకు ఉత్తరాభాద్ర నక్షత్రం,వృషభ లగ్నంలో వివాహ ముహూర్తం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించేందుకు బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఈ వివాహానికి ముందు ఆగస్టు 29న అన్నారుగూడెంలోని వరుణి స్వగృహంలో ఉదయం 11:30 గంటల నుంచి విందు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా ఆయన అక్షింతలు వేసి ఆకాంక్షించారు. అదేవిధంగా బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట అన్నారుగూడెం ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు నాయకులు పులి వెంకట నరసయ్య, యూత్ నాయకులు గోవిందు సురేష్, బంధుమిత్రులు సూద రఘు వరుణి తల్లిదండ్రులు ఉన్నారు.

# ఘనంగా కింగ్ అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు.



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 29** ప్రముఖ టాలీవుడ్ నటుడు కింగ్ అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలు శనివారం జమ్మికుంట పట్టణంలోని అన్నపూర్ణ టాకీస్ లో డాన్ రమేష్ ఆధ్వర్యంలో నాగార్జున జన్మదిన వేడుకలను అభిమానుల సమక్షంలో నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ కొలుగూరి సురేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు,ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు అనంతరం రమేష్ మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు, కుమారుడు కింగ్ నాగార్జున విక్రమ్ సినిమాతో పరిచయమై శివా, గీతాంజలి, నిన్నే పెళ్లాడుతా ,అన్నమయ్య, మన్మధుడు, మనం, సోగ్గాడే చిన్నినాయన, వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలు తో ప్రేక్షకుల మెప్పు పొందిన వ్యక్తిగా ఇండస్ట్రీలో స్థిర స్థాయిగా నిలిచిపోయారు, ప్రేక్షకులకు అభిమానులకు మంచి మంచి చిత్రాలు అందించి ప్రేక్షకులను అలరించాలని ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆయురారోగ్యాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అక్కినేని ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు డాన్ రమేష్, మండల అధ్యక్షుడు రాజేష్, చందు, శ్రీనివాస్, శ్రీకాంత్, వడ్లూరు సంపత్, వడ్లూరి శశి కుమార్, గుల్లి కుమార్, నాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# కేశవరెడ్డి మృతి తీరని లోటు..

## టీపీసీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు..

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం ఆగస్టు 29:**గ్రామస్తుల అందరితో ఆప్యాయంగా ఉండే మృదు స్వభావి కేశవరెడ్డి లేని లోటు తీర్చలేనిదని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన నారపోగు వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. కేశవరెడ్డి మృత్యువాత తెలుసుకున్న ఆయన తన సంతాపాన్ని ప్రకటించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు గుర్తుచేసుకున్నారు. ఆయన అకాల మృతి వ్యక్తిగతంగా తనకు తీరని లోటు అన్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఉన్నా సమయంలో ఆయనతో కలిసి పనిచేసిన ఫోటోను గుర్తు చేసుకున్నారు.



సర్పంచిగా తనకు ఎంతో అండగా ఉంటూ రాజకీయంగా ఆర్థికంగా సేవలు అందించారని గుర్తు చేశారు. ఆ కుటుంబానికి భగవంతుడు ధైర్యం కల్పించాలని అన్నారు.

# విజయసాయిరెడ్డి సంచలన బహిరంగ లేఖ

"వైసీపీ కోటరీ నన్ను నమ్మకద్రోహి అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తోంది" అంటూ మాజీ వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బహిరంగ లేఖ విడుదల చేశారు.జగన్‌కు తాను ఎప్పుడూ నమ్మకద్రోహం చేయలేదని, నమ్మకద్రోహమే తన రక్తంలో ఉంటే ఎప్పుడో పార్టీ మారిపోయేవాడినని ఆయన పేర్కొన్నారు. జగన్‌గారికి నమ్మకస్తుడిననే కారణంతోనే అనేక కేసుల్లో తనను నిందితుడిగా చేర్చారని తెలిపారు.2020 తర్వాత తనపై పార్టీలో క్రమంగా కుట్రలు, అవమానాలు పెరిగాయని విజయసాయిరెడ్డి ఆరోపించారు. తనను ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తప్పించడంతో పాటు కోర్ కమిటీ నుంచి కూడా తొలగించారని పేర్కొన్నారు."నేను ఎప్పుడూ కోటరీలో లేను. జగన్‌గారి దృష్టిలో నా మాటకు ఉన్న విలువను 2020 నుంచి అంచెలంచెలుగా తగ్గించింది ఎవరు?" అని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో సజ్జల రామకృష్ణారెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారని విజయసాయిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రులకు సైతం జగన్‌ను కలవకుండా అడ్డుకున్నది సజ్జలేనని ఆరోపించారు.పార్టీలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు సజ్జల ఆధ్వర్యంలో పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనిపై కార్యకర్తలు, జగన్ అభిమానులు ఆలోచించాలని ఆయన కోరారు.తాను పార్టీకి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసి ఇప్పుడు వేరే పార్టీ పెడుతున్నానని విజయసాయిరెడ్డి తన లేఖలో వెల్లడించారు.కాగా, ఈ బహిరంగ లేఖలో విజయసాయిరెడ్డి వైసీపీ అంతర్గత వ్యవహారాలు, తనపై జరిగిన అవమానాలు, సజ్జల పాత్రపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేసి కన్విక్షన్ రేటు పెంచా

నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చేసి కన్విక్షన్ రేటు పెంచాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన కోర్ట్ లైజన్ ఆఫీసర్లు, కానిస్టేబుళ్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.పోక్సో తదితర తీవ్రమైన కేసుల్లో బాధితులకు త్వరతగతిన న్యాయం జరిగేవిధంగా భరోసా కల్పించాలని, పెండింగ్ వారెంట్లను తక్షణమే అమలు చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు జాతీయ అవార్డు సాధించిన 'సీఎంఎస్' యాప్‌ను వందశాతం వినియోగించుకోవాలని దిశానిర్దేశం చేశారు.సిఎంఎస్ యాప్‌ను రూపొందించి జిల్లా పోలీసు శాఖకు జాతీయ గుర్తింపు తెచ్చిన ఎస్పీ కి అందరూ కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమీక్ష లో సీఎంఎస్ ఇన్స్పెక్టర్ జె. ప్రసాద్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com